బయ్యవరంలో కలకలం

- వంతెన కింద మూటలో మహిళ శరీర భాగాలు
- పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఎస్పీ వకుల్ జిందాల్
- ఎక్కడో హత్యచేసి.. శరీర భాగాలను ఇక్కడ వేసినట్టు వెల్లడి

· 8లో

లేటరైట్!?

భమిడికలొద్దిలో మళ్లీ తవ్వకాలకు రంగం సిద్ధం

- క్వారీ ప్రాంతానికి మిషనరీ, వాహనాలు
- తెర వెనుక కూటమి పార్టీ నేత
- స్థానికంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు
- బియ్యం కార్డుదారులకు నెలకు రూ.1,000 చొప్పున అందజేస్తామని హామీ



భమిడికలొద్ది లేటరైట్ క్వారీ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికలొద్దిలో జర్తా లక్ష్మణరావుకు చెందిన క్వారీలో లేటరైట్ తవ్వకాలకు మళ్లీ రంగం సిద్ధమైంది. ప్రభుత్వంలో కీలక వ్యక్తి తెర వెనుక ఉండగా, నర్సీపట్నానికి చెందిన వ్యాపారి తవ్వకాల బాధ్యత తీసుకున్నారు. లేటరైట్‌ను తవ్వి తరలించేందుకు వీలుగా భమిడికలొద్ది క్వారీ నుంచి కాకినాడ జిల్లా రౌతులపూడి వరకూ రహదారిని గత పక్షం రోజుల నుంచి మరమ్మతు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం క్వారీ పాయింట్ వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారనే ప్రచారం సాగుతుంది. తవ్వకాలకు అవసరమైన మిషనరీని కొండపైకి చేర్చారంటున్నారు. ఈ వారంలో రహదారి మరమ్మతులు పూర్తిచేసిన తరువాత తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలిసింది.**

భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన గిరిజనుడు జర్తా లక్ష్మణరావు పేరిట అనుమతులు వచ్చాయి. అయితే లక్ష్మణరావు బినామీ మాత్రమే. ఆయన్ను ముందుపెట్టి వైసీపీకి చెందిన కీలక నేత కుమారుడు లేటరైట్ తవ్వకాలు చేపట్టారు. భమిడికలొద్దిలో క్వారీయింగ్, అక్కడ నుంచి రౌతులపూడి వరకు రహదారి నిర్మించిన ప్రాంతంపై అనేక వివాదాలు ఉన్నాయి. రిజర్వు అటవీ ప్రాంతంలో వేలాది చెట్లు కొట్టేసి రోడ్డు నిర్మించారు. దీనిపై నాతవరం మండలానికి చెందిన మరిడయ్య ఎన్జీటీలో ఫిర్యాదు చేయడతో విచారణ జరిగింది. ఒకపక్క విచారణ జరుగుతుండగానే పాలకుల దన్నుతో లేటరైట్‌ను తవ్వేసి లక్షల క్యూబిక్ మీటర్లు తరలించుకుపోయారు. క్వారీ ప్రాంతంలో ఇప్పటివరకూ ఎంత తవ్వారు?, రాయల్టీ ఎంత చెల్లించారు?...అన్న విషయాలు గనుల శాఖ ఎన్నడూ వెల్లడించలేదు. గత ఏడాది ఎన్నికల ముందు తవ్వకాలు ఆపారు. అప్పటికే రౌతులపూడిలో నిల్వ చేసిన లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్‌ను ఇటీవల కొందరు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇంకా రౌతులపూడి మండలంలో మరో రెండుచోట్ల ఉన్న నిల్వలను కొద్దిరోజుల నుంచి రాత్రిపూట తరలిస్తున్నారు.

ఇదిలావుండగా ప్రభుత్వం మారడంతో లేటరైట్ తవ్వకాల నుంచి వైసీపీ కీలక నేత కుమారుడు తప్పుకోగా, ప్రస్తుతం కూటమిలో ఉన్న పార్టీకి చెందిన మరో నాయకుడు రంగంలోకి దిగారు. లీజుదారుడు జర్తా లక్ష్మణరావుకు బినామీగా నర్సీపట్నానికి చెందిన వ్యాపారిని తెరపైకి తీసుకువచ్చారు. భమిడికలొద్ది క్వారీ ఉన్న సుందరకోట పంచాయతీలో ప్రజల నుంచి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీలో సుందరకోట, భమిడికలొద్ది, హసనగిరి, తొర్రడ, ముంత మామిడిలొద్ది, పాత సిరిపురం, కొత్త సిరిపురం గ్రామాల ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకునే బాధ్యతను స్థానిక నేతలకు అప్పగించారు. ఎనిమిది గ్రామాల పరిధిలో మొత్తం 500 వరకు బియ్యం కార్డుదారులుండగా ప్రతి కార్డుదారుడికి నెలకు రూ.1000 వంతున పరిహారం ఇస్తామని హామీ ఇస్తున్నట్టు తెలిసింది.

లేటరైట్ తవ్వకాలకు అనుమతులు

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికలొద్ది, సరుగుడు ప్రాంతాల్లో లేటరైట్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని మైనింగ్ ఏడీ శివాజీ తెలిపారు. మంగళవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ భమిడికలొద్ది క్వారీ జర్తా లక్ష్మణరావు పేరు మీద ఉందన్నారు. మొత్తం 121 హెక్టార్లలో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. అలాగే సరుగుడులో కిల్లో లోవరాజు పేరుతో 20 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని శివాజీ తెలిపారు.

సరుగుడు లేటరైట్‌పైనా కూటమి నేతల కన్ను?

- 40 హెక్టార్లలో తవ్వకాలకు ఈసీ అనుమతి
- తెర వెనుక ఇద్దరు నేతలు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో గల మేలు రకం లేటరైట్‌పై కూటమికి చెందిన కొందరు నేతల కన్నుపడింది. గిరిజనులకు మైనింగ్ లీజులు వచ్చేలా తెర వెనుక ఇద్దరు నేతలు చక్రం తిప్పారు. ఈ నేపథ్యంలో గత ఏడాది చివరిలో ఇద్దరికి లేటరైట్ తవ్వకాల నిమిత్తం కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు లభించాయి. ఈ విషయాన్ని ఇప్పటివరకూ అత్యంత గోప్యంగా ఉంచారు. విశ్వసనీయంగా అందిన వివరాల ప్రకారం...సరుగుడు గ్రామ పరిధిలో చెరో 20 హెక్టార్లలో తవ్వకాలకు ఇద్దరు గిరిజనులు దరఖాస్తు చేశారు. వాటిని గనుల శాఖ పరిశీలించి జిల్లా యంత్రాంగం ద్వారా ప్రభుత్వానికి పంపగా...అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల కమిటీలు పరిశీలించి ఆమోదం తెలిపాయి.

చెరువులకు మహర్దశ

కేంద్ర సహకారంతో అభివృద్ధికి అటవీ శాఖ ప్రణాళిక



ఆక్రమణల కారణంగా నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయిన లక్ష్మీపురం చెరువు

- గ్రామాల్లో చెరువుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- రెవెన్యూ శాఖ సహకారంతో త్వరలో సర్వే
- వాస్తవ విస్తీర్ణం, కబ్జాకు గురైంది ఎంత అన్న వివరాలు సేకరణ
- ఆక్రమణలను తొలగించి, పూడిక తీత
- నీటి నిల్వ సామర్థ్యం పెంపు
- గట్లపై మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధి
- చేపల పెంపకంతో పంచాయతీలకు అదనపు ఆదాయం
- పక్షుల ఆవాసాలుగా తీర్చిదిద్దాలని ప్రణాళిక

చోడవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): **గ్రామీణ ప్రాంతంలో చెరువుల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చెరువుల అభివృద్ధికి అటవీ శాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇందులో భాగంగా అటవీ శాఖ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఏ మండలంలో ఎన్ని చెరువులు వున్నాయి, ఒక్కో చెరువు విస్తీర్ణం ఎంత, ఇందులో ఆక్రమణకు గురైంది ఎంత అన్న వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నిధులతో దశలవారీగా చెరువులను అభివృద్ధి చేస్తారు. ఇందులో భాగంగా తొలుత రికార్డుల ప్రకారం సర్వే చేసి చెరువుల విస్తీర్ణాన్ని నిర్ధారిస్తారు. ఆక్రమణలు వుంటే వాటిని తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచేలా పనులు చేపడతారు. అనంతరం చెరువుల్లో చేపల పెంపకంతో, గట్లకు ఇరువైపులా మొక్కలు నాటి చెట్లు పెంచారు. చెరువుల ద్వారా పొలాలకు నీరు అందించడమే కాకుండా పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా చేస్తారు. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, పక్షులకు ఆవాసాలుగా చెరువులను అభివృద్ధి చేస్తారు.**

చోడవరం అటవీ శాఖ రేంజి పరిధిలోని చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 321 చెరువులను అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. తరువాత దశలో రెవెన్యూ శాఖ సహకారంతో చెరువుల వాస్తవ విస్తీర్ణం, వాటి ఆయకట్టు తదితర వివరాలను సేకరిస్తారు. తొలుత ఎక్కువ విస్తీర్ణం వున్న చెరువులను అభివృద్ధి చేసే అవకాశం వుందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

చెరువులకు పూర్వ స్థితి

చెరువుల అభివృద్ధి పథకం అమలైతే గ్రామాల్లోని చెరువులకు పూర్వ స్థితి వస్తుందని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో దాదాపు అన్ని చెరువులు ఎంతో కొంత ఆక్రమణకు గురయ్యాయి. ముఖ్యంగా చెరువు గర్భాలను రాజకీయ పలుకుబడి వున్న వ్యక్తులు ఆక్రమించుకుని పంట భూములుగా మార్చేశారు. దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి, ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో నీరు అందని పరిస్థితి నెలకొంది. పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం అధికంగా వున్న ప్రాంతాల్లోని చెరువులు, గ్రామాలకు ఆనుకుని వున్న చెరువులు అధికంగా ఆక్రమణకు గురయ్యాయి. ఇటువంటి చోట్ల చెరువుల్లో వర్షం నీరు నిలవకుండా తూములను ధ్వంసం చేసేస్తున్నారు. కొన్నిచెట్ల చెరువు గట్లపై ఇళ్లు, దుకాణాలు సైతం నిర్మించుకున్నారు.

ఒకప్పుడు వేసవిలో సైతం చెరువుల్లో నీరు వుండేది. ఆక్రమణల కారణంగా ఇప్పుడు జనవరి నెలలోనే చెరువులు ఎండిపోతున్నాయి. కబ్జాలతో చెరువుల వాస్తవ విస్తీర్ణం ఎంత వుందో స్థానికులు కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే చెరువులకు పూర్వ వైభవం వచ్చే అవకాశం వుంది.

చెరకు పంటకు నిప్పంటించిన రైతు

- కూలీ, రవాణా ఖర్చులు భరించి ఫ్యాక్టరీకి పంపినా.. క్రషింగ్ జరుగుతుందన్న నమ్మకం లేకపోవడం వల్లేనని ఆవేదన



రైతు నిప్పు పెట్టడంతో దహనమవుతునన్న చెరకు తోట



పంటకు నిప్పు పెట్టిన రైతు రొంగలి వెంకటరావు

అనకాపల్లి/దేవరాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చోడవరంలో మండలంలోని గోవాడ షుగర్స్‌లో క్రషింగ్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన రొంగలి వెంకటరావు తన 65 సెంట్లలో చెరకు తోటకు మంగళవారం నిప్పుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి తాను షేర్ హోల్డర్‌గా ఉన్నానని, కొంతకాలం క్రషింగ్ సక్రమంగా జరగడం లేదని, చెల్లింపులు కూడా ఆలస్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో తాను ఫ్యాక్టరీకి 50 నుంచి 60 టన్నుల చెరకు పంపించేవాడినని, క్రషింగ్ ఆలస్యం అవుతుండడంతో పంట విస్తీర్ణం తగ్గించేశానన్నారు. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ప్రస్తుతం తన 65 సెంట్లలోని చెరకును కటింగ్ చేసి క్రషింగ్ కోసం గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి తరలించాలంటే కనీసం రూ.8 వేలు నుంచి రూ.9 వేల వరకు ఖర్చవుతుందన్నారు. అంత పెట్టినా ఆరు నెలలకో, సంవత్సరం తరువాతో చెల్లింపులు జరుగుతాయని అంటున్నారు. గతంలో 15 రోజులకు ఒకసారి చెరకు బిల్లులు చెల్లించేవారని, ఇప్పుడు బాగా ఆలస్యం అవుతోందన్నారు. అందుకే కూలీ, రవాణాకు పెట్టుబడి పెట్టలేక, క్రషింగ్ ... మిగతా 8వ పేజీలో

ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై సీఐడీ దూకుడు

భూ సమీకరణ ఫిర్యాదులపై విచారణ వేగవంతం

- ఇప్పటికే కీలక రికార్డులు స్వాధీనం
- అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో నాడు పనిచేసిన అధికారులు, సిబ్బందికి తాజాగా నోటీసులు జారీ
- పలు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఆపాలని హౌసింగ్‌కు లేఖ



అనకాపల్లి మండలం సంపతిపురంలో రైతుల నుంచి సమీకరించిన భూమిలో పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) మాటున వైసీపీ నాయకులు పాల్పడిన అక్రమాలపై సీఐడీ విచారణను వేగవంతం చేసింది. అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన స్థలాలు, భూముల కొనుగోలు/ అమ్మకాలకు అవకాశం లేకుండా సీఐడీ అధికారులు రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అనకాపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించి సుమారు 900 ఎకరాలకు సంబంధించి సర్వే నంబర్ల వివరాలను రిజిస్ట్రార్‌కు అందించినట్టు తెలిసింది.**

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూములను సమీకరించాలని 2021-22లో అధికారులకు ఆదేశాలు జారీచేసింది. భూములు ఇచ్చిన రైతులకు ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన లేఅవుట్లలో స్థలాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. జిరాయితీ భూమి అయితే ఎకరాకు 1,800 గజాలు, డి.పట్టా భూమి అయితే 900 గజాలు, పదేళ్లకు మించి పేద రైతులు సాగు చేసుకుంటూ పట్టా లేని భూమి అయితే 450 గజాలచొప్పు కేటాయించాలని పేర్కొన్నది. ఈ విషయం ముందుగానే వైసీపీ నాయకులకు చేరింది. భూ సమీకరణ చేసే గ్రామాలు, ఆయా సర్వే నంబర్లు వివరాలను అధికారుల నుంచి సేకరించారు. డి.పట్టాదారులు, ఎటువంటిపట్టా లేకుండా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న వారి జాబితాలను రప్పించుకున్నారు. పలువురు రైతులను భయపెట్టి, బెదిరించి తక్కువ ధరకు బినామీ పేర్లతో కొనుగోలు చేశారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డుల్లో పేర్లు మార్చేశారు. తరువాత అధికారులు మొత్తం 111 గ్రామాల్లో సుమారు 900 ఎకరాలు సమీకరించి లేఅవుట్లు వేశారు. వైసీపీ నాయకులు రిటర్న్ ప్లాట్లుగా లేఅవుట్లలో మంచి వాస్తు, రహదారికి పక్కనన్న స్థలాలను తీసేసుకున్నారు. ఈ తరహా అక్రమాలు కుంచంగి, కూండ్రం, సంపతిపురం, కోడూరు, కొండుపాలెం, వేటజంగాలపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో అధికంగా జరిగాయి. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వయంగా డీజీపీకి ఫిర్యాదు చేసి, ల్యాండ్ పూలింగ్ పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. కానీ నాటి ప్రభుత్వం ఫిర్యాదును బుట్టదాఖలు చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత వైసీపీ నేతల భూ అక్రమాలపై సీఐడీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ల్యాండ్ పూలింగ్‌లో అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. గత ఏడాది డిసెంబరులో అనకాపల్లి, సబ్బవరం తహసీల్దారు కార్యాలయాల్లో సీఐడీ అధికారి నాగేంద్ర భూపాల్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ల్యాండ్ పూలింగ్‌కు ... మిగతా 8వ పేజీలో

364 కిలోల గంజాయి పట్టివేత

ఏడుగురి అరెస్టు, రెండు కార్లు సీజ్

- ఏవోబీలో చిత్రకొండ నుంచి పుణెకు రవాణా చేస్తుండగా పట్టుకున్న సబ్బవరం పోలీసులు



పట్టుకున్న గంజాయి, నిందితులతో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): **జాతీయ రహదారిపై మండలంలోని మర్రిపాలెం టోల్ ప్లాజా వద్ద మంగళవారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు 364 కిలోల గంజాయి పట్టుబడింది. దీనిని రవాణా చేస్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. రెండు ఖరీదైన కార్లను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ స్థానిక పోలీసు స్టేషన్‌లో మీడియాకు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.**

అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు సబ్బవరం పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐలు పి.సింహాచలం, దివ్య, పోలీసు సిబ్బంది మర్రిపాలెం టోల్ ప్లాజా వద్దకు వెళ్లి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో సబ్బవరం వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న టయోటా ఫార్చ్యునర్, మారుతి బ్రెజ్జా కార్లను ఆపి తనిఖీ చేశారు. ఫార్చ్యునర్ కారులో 169 గంజాయి ప్యాకెట్లు లభించాయి. దీని డ్రైవర్‌తోపాటు ఈ వాహనానికి పైలట్‌గా వస్తున్న బ్రెజ్జా కారులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా అల్లూరి జిల్లా సరిహద్దులోని ఒడిశా రాష్ట్రం చిత్రకొండ ప్రాంతంలో ... మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

రసాయన పరిశ్రమల్లో రక్షణ చర్యలు తప్పనిసరి

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రసాయన పరిశ్రమల లోపల, బయట రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహమించిన సమావేశంలో రసాయన పరిశ్రమల్లో చేపట్టిన రక్షణ చర్యలపై ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.12 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4.47 (గురువారం ఉదయం)

వేసవి ఆరంభంలోనే తాగునీటి కష్టాలు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చినవెదుళ్లపాలెంలో మరీ దారుణం
- నేల బావిపైకి ఎక్కి నీరు తోడుకుంటున్న వైనం

నక్కపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవి ఆరంభంలోనే పలు గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. మార్చిలోనే నీటి కోసం మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని 33 పంచాయతీలుండగా.. మరో 22 వరకూ శివారు గ్రామాలున్నాయి. శివారు గ్రామాల ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలోనే పరిస్థితి ఇలా వుంటే రానున్న మూడు నెలల్లో దారుణంగా ఉండే సూచనలు కన్పిస్తున్నాయి. సీహెచ్‌బీ అగ్రహారం శివారు చినవెదుళ్ల పాలెం గ్రామస్థులు నీటి కోసం నరకయాతన పడుతున్నారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో పొలంలో వున్న నేల బావి వద్దకు వెళ్లి నీరు తోడుకోవల్సి వస్తోంది. అత్యంత ప్రమాదకరంగా నేలబావిపై నిలబడి మహిళలు నీరు తోడుకోవల్సి వస్తోంది. ఉపమాక జగనన్న కాలనీ వాసులకు రెండేళ్ల నుంచి తాగునీరే లేదు. వీరంతా ఉపమాక వెళ్లి నీరు తెచ్చుకోవల్సి వస్తోంది. ఉపమాక శివారు మనబాలవానిపాలెం, సారిపల్లివానిపాలెం, శీనయ్యపాలెం గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. పెదబోదిగల్లం, చినబోదిగల్లం, న్యాయంపూడి ఎస్సీ కాలనీల్లో నీటి కోసం మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల్లో వారంలో రెండు రోజులు మాత్రమే కొళాయిల ద్వారా నీరు సరఫరా కావడంతో కొందరు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ కారణంగా ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. అధికారులు స్పందించి నీటి కష్టాలు తీర్చాలని తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


నేలబావిలో నీటిని తోడుకుంటున్న మహిళలు


బైక్‌పై నీరు తీసుకెళ్తున్న దృశ్యం

మామిడిపై సన్నగిల్లుతున్న ఆశలు

- అలస్యంగా వచ్చిన పూత పిందెలుగా మారి రాలిపోతున్న వైనం
- మంచు ప్రభావమేనంటున్న రైతులు

కోటవురట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మంచు ప్రభావంతో పూత, పిందెలు రాలిపోవడంతో మామిడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. వాతావరణం పరిస్థితులు అనుకూలించకపోవడంతో పెట్టుబడులు అధికం అవుతున్నాయని వాపోతున్నారు.

ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు మామిడి రైతులకు అనుకూలించడం లేదు. గత ఏడాది డిసెంబరులో రావాల్సిన మామిడి పూత జనవరి నెలాఖరుకు వచ్చింది. ఆలస్యంగానైనా పూత విరగబూసింది. దీంతో రైతులు దిగుబడులు పెరుగుతాయని ఆశ పడ్డారు. అయితే వచ్చిన పూత రాలిపోతుంటే వారు ఆందోళన చెందుతున్నారు. పూత రాలిపోయి కాడలు కనిపిస్తుండడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎకరాకు ఇప్పటికే దుక్కులు, కూలీలు, మందులు తదితర వాటికి సుమారు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు ఖర్చు పెట్టారు. కాడకు పది పిందెలు నిలిస్తే అవి కూడా పాలిపోయినా రంగులో రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

మామిడి సాగులో లాభాలు కంటే ఎక్కువగా నష్టాలు వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పందూరు అల్లుమియాపాలెం, కైలాసపట్నం, కోటవురట్ల, కె.వెంకటాపురం, కొడవటిపూడి వీకేపల్లి, బోడపాలెం గ్రామాల్లో కౌలు రైతులు ఎక్కువగా మామిడి తోటలను పెంచుతున్నారు. కౌలు ధర కంటే చీడపీడల నుంచి పూత, పిందెలను కాపాడుకోవడానికి ఖర్చు ఎక్కువగా అవుతున్నదని వారు ఆందోళన చెందుతున్నారు. ముందు వచ్చిన పూత పిందె కడుతోంది.. అదే ఆలస్యంగా వచ్చిన పూత నిలబడడం లేదని అంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరిలో కూడా రాత్రి,పగటి ఉష్ణోగ్రతల మార్పులతో మంచు తీవ్రంగా పడడం, పూత, పిందె నల్లబారి రాలిపోతున్నాయి. ఇటువంటి సమయంలో వర్షం కురిస్తే చీడపీడల ప్రభావం తగ్గి పిందెలకు, పూతకాడలకు బలం చేకూరుతుందని మామిడి రైతులు అంటున్నారు.


పిందె రాలిపోయి కాడలు కనిపిస్తున్న దృశ్యం

ప్రజాధనంపై మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం

- మండుటెండలో వదిలేసిన విలువైన సామగ్రి

ఎలమంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ధనమే కదా పోతే పోనీలే.. అన్న రీతిలో మునిసిపల్ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని చాటుకుంటున్నారు. ఫలితంగా మండుటెండలో వదిలేసిన విలువైన కుర్చీలు ఎండకు ఎండి.. వానకు తడిసి నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం సచివాలయాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి విలువైన ఫర్నిచర్‌ను పంపిణీ చేసింది. పట్టణంలో 13. 14 సచివాలయాలను కొమ్మాయిగుండం వద్ద నుంచి పీవీ కాంప్లెక్సుకు మార్పు చేసేందుకు అధికారులు నూతన భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అక్కడి భవనంలో ఉన్న ఫర్నిచర్‌ను మునిసిపల్ కార్యాలయం వద్ద ఉంచారు. విలువైన ఈ సామగ్రి దెబ్బతినకుండా చూడాల్సిన అధికారులు మండుటెండలో పడేశారు. ఈ ఫర్నిచర్ ఎండలో ఎండుతూ కొన్ని దెబ్బతినగా.. మరికొన్ని నిరుపయోగంగా మారుతున్నాయి. నిత్యం మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చిపోయే మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్దనే ఎండలో వీటిని వదిలేసిన పట్టించుకునే నాథులే కరవయ్యారు. మునిసిపల్ అధికారులు ఇకనైనా ప్రజాధనమే కదా అని నిర్లక్ష్యం వహించకుండా సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.


మునిసిపల్ కార్యాలయం వద్ద ఎండలో వదిలేసిన కుర్చీలు

కూలి కోసం ఉపాధి కూలీల ఆందోళన



కొడవటిపూడిలో వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నుంచి నేటికి ఉపాధి కూలీలకు వేతన బకాయిలు అందలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం మండలంలోని కొడవటిపూడిలో వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఉపాధి కూలీలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఉపాధి కూలీలకు వేతన బకాయిలు మంజూరు చేయకుంటే ఏమి తిని బతుకుతారని ప్రశ్నించారు. వేతనాల జాప్యంతో చాలా గ్రామాల్లో కూలీలు ఇతర జిల్లాలకు ఉపాధి కోసం వలస పోతున్నారన్నారు. కార్యక్రమంలో కొల్లికన్నయ్య, పాము రమణ, సూరిబాబు, భీమరాజురమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

- ట్రాన్స్‌జెండర్స్ ఆధ్వర్యంలో సారె ఊరేగింపు

ఎలమంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేషుకొండ కాలనీ నూకాంబిక అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాలనీకి చెందిన ట్రాన్స్‌జెండర్స్ సంఘ ప్రతినిధి శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాలనీ ప్రజలంతా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గాయత్రి హోమం నిర్వహించారు. సాయంత్రం కాలనీ వీధుల్లో అమ్మవారి సారె ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు యేసు, రూప, సుప్రియ, సంగీత, అన్నపూర్ణ, లత, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధి ఆడారి గంగాధర్ పాల్గొన్నారు.


ఎలమంచిలి శేషుకొండ కాలనీలో నూకాంబిక అమ్మవారికి సారె ఊరేగిస్తున్న భక్తులు

'విద్యుత్ మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలి'

పాయకరావుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్‌లో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించి, నెలవారి వేతనాలు అమలుచేయాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ అనకాపల్లి డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు నాయకులు ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈని కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు సీహెచ్. చలపతిరావు, పసగడుగుల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌కి విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. గతేడాది ఫిబ్రవరిలో విద్యుత్ శాఖ అడిషనల్ సెక్రటరీ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, పి.తులసీరావు, జి.గాంధీ, జి.నూకరాజు,బి.శ్రీను, వి.రమేష్ బాబు, కార్తీక్‌తోపాటు ఏఐటీయూసీ నాయకులు దొరబాబు, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


ఈపీడీసీఎల్ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

పరదేశమ్మను దర్శించుకున్న జనసేన నేత


పరదేశమ్మను దర్శించుకున్న సుందరపు సతీష్

మునగపాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవర్ల అనకాపల్లిలో పరదేశమ్మని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధికార ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ దర్శించుకున్నారు. పండుగ సందర్భంగా కమిటీ పెద్దలు ఆహ్వానంతో ఆయన మంగళవారం ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కూటమి శ్రేణులు ఉన్నారు.

సస్యరక్షణతోనే పంట దిగుబడులు

పాయకరావుపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణతో అపరాల పంట తెగుళ్ల బారిన పడకుండా రక్షించుకుని అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాధికారి పి.ఆదినారాయణ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని సత్యవరంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అపరాల పంటను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ పంటలకు సోకే తెగుళ్లను ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా తెలుసుకుని ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సఖిలేటి రాము, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహాయకులు ఎస్.అమృత, పి.మౌనిష్, రైతులు పాల్గొన్నారు.


సత్యవరంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏవో ఆదినారాయణ

మూలపేట దళిత కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న గ్రామస్థులు

మునగపాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేట దళిత కాలనీలో సీసీ రోడ్డును రూ.2.9 లక్షలతో మంగళవారం వేశారు. ఈ పనులను సర్పంచ్ భీశెట్టి గంగఅప్పలనాయుడు, కూటమి నాయకులు కాండ్రేగుల గాంధీ, ఆడారి జనార్దనరావు, శరగడం నాగేశ్వరరావు, భీశెట్టి నాగేశ్వరరావు తదితరులు పరిశీలించారు.

గూడుపమ్మని దర్శించుకున్న తోట నగేశ్


తోట నగేశ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్ మంగళవారం దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో తోట నగేశ్‌ను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మోటూరుపాలెం పాఠశాల పనులకు బిల్లులు చెల్లించలేదు : హెచ్‌ఎం

అచ్యుతాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మోటూరుపాలెం పాఠశాలలో జరిగిన నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించలేదని పాఠశాల హెచ్‌ఎం టి. లక్ష్మి తెలిపారు. ఆరేళ్ల క్రితం పాఠశాలలో చేసిన నిర్మాణ పనులకు అప్పట్లో బిల్లులు తీసుకొని, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ తీర్మానంతో మరల సొమ్ము చేసుకున్నారని టీడీపీ నాయకుడు అడిగర్ల దేముడు సోమవారం కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ వార్త 'ఆంధ్రజ్యోతి'లో రావడంతో ఆమె స్పందించారు. 2018లో ఎస్ఎస్ఏ అనుమతితో పాఠశాల ఆవరణలో అప్పటి సర్పంచ్ లక్ష్మీభవాని, పాఠశాల ఛైర్మన్ అంగీకారంతో వంటశాల నిర్మించారన్నారు. భవన నిర్మించిన తుమ్మల రాజు పేరున బిల్లులు చేశామన్నారు. కాని 2019లో ప్రభుత్వం మారడంతో బిల్లులు మంజూరు కాలేదని ఆమె తెలిపారు.

క్రైస్తవుల రక్షణకు పాస్టర్లు పనిచేయాలి

అచ్యుతాపురం రూరల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల రక్షణకు పాస్టర్లు తమ సేవలను కొనసాగించాలని ప్రముఖ క్రైస్తవ మత బోధకుడు దిగుమర్తి జయరాజు పిలుపు నిచ్చారు. మోసయ్యపేటలో మంగళవారం జరిగిన క్రైస్తవ ఐక్య కార్యాచరణ సమితి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత సామరస్యాన్ని పాస్టర్లు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మండల పాస్టర్ల సహవాసం నాయకులు మట్టా తిమోతీనాయుడు, ప్రేమ్‌కుమార్, జయకుమార్, యేసు పాదం, జాన్‌మార్క్, వరప్రసాద్, రంగా రావు, అబ్రహాము పాల్గొన్నారు.

కృష్ణంరాజు కాలువలో పూడికతీత


కాలువలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న కూటమి నేతలు

మునగపాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అరబుపాలెం పరిధిలోని కృష్ణంరాజు సాగునీటి కాలువలో పూడిక తీత పనులు మంగళవారం మొదలయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాల మేరకు ఏషియన్ పెయింట్స్ సౌజన్యంతో పూడికతీత పనులు జరుగుతున్నాయని కూటమి నాయకులు తెలిపారు. ఈ పనులతో వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకుడు ఏవీ.సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు టెక్కలి పరశురాం, యల్లపు సంతోష్, కొయిలాడ గంగాధర్, రవి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కొబ్బరి తోట దగ్ధం

మునగపాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడ పంచాయతీలో జరిగిన అగ్నిప్రమాదంలో కొబ్బరితోట దగ్ధం అయ్యిందని బాధిత రైతు బొడ్డేడ అప్పారావు తెలిపారు. మంగళవారం జరిగిన విద్యుత్ షార్టుసర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదం కారణంగా 74 సెంట్లు భూమిలో 75 చెట్లు కాలిపోయాయన్నారు. కొబ్బరి చెట్లకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని విద్యుత్, రెవెన్యూ శాఖాధికారులను కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో భవానీ విద్యార్థులకు తృతీయ స్థానం


మూడో బహుమతి గెలుచుకున్న భవానీ విద్యానికేతన్ విద్యార్థులు

అచ్యుతాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కర్మాగారంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక భవానీ విద్యానికేతన్‌కి చెందిన విద్యార్థినులు తృతీయ స్థానాన్ని సాధించారు. మంగళవారం నిర్వహించిన ఈ ప్రదర్శనలో పాఠశాలకు చెందిన కె. లోకజ్ఞ, వి. చరిత కలిసి స్మార్ట్ హెల్మెట్ తయారు చేసి తృతీయ స్థానం సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 110 పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను పాఠశాల వ్యవస్థాపకులు మూర్తిప్రసాద్, కరస్పాండెంట్ సంతోష్ కుమార్ అభినందించారు.

మండుతున్న ఎండలు

- బయటకు వచ్చేందుకు భీతిల్లుతున్న ప్రజలు


కోటవురట్లలో గొడుగులు, చున్నీలు కట్టుకొని వెళుతున్న విద్యార్థినులు

కోటవురట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజుల నుంచి భానుడు భగ్గున మండుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచి వడగాడ్పులు వీయడంతో ఇళ్లలోంచి బయటకు రావడానికి ప్రజలు భీతిల్లుతున్నారు. మంగళవారం కోటవురట్లలో ఉష్ణోగ్రత 37.3 డిగ్రీలు నమోదు కాగా.. రాజుపేటలో 39 డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమశాతం అధికంగా ఉండడంతో వడగాడ్పు, ఉక్కపోత చోటుచేసుకున్నాయి. వృద్ధులు, పిల్లలు అపసోపాలు పడుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో ప్రధాన రహదారులలో జనసంచారం లేక బోసిపోతున్నాయి. ఉపాధి కూలీలు పనులను 9 గంటలకు ముగించుకొని ఇంటికి చేరుకుంటున్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

- ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి విజయ



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

అచ్యుతాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాలికలకు చట్టాలపై అవగాహన అవసరమని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ అన్నారు. స్థానిక అచ్యుత డిగ్రీ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల రక్షణకు ఈచట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాలికలకు ఇతరుల నుంచి ఏమాత్రం అవమానం కలిగినా తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా యుక్త వయసులో ఉన్న బాలికలకు ఇతరుల వల్ల ఎక్కువ ఇబ్బందులు కలుగుతాయని, వాటిని అధిగమించాలంటే చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అచ్యుత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, లోక్ అదాలత్ వైస్ ప్రెసిడెంట్ పీవీ రమణ, డి.వెంకటరావు, బి.హరిశంకరరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మ రక్షణపై శిక్షణ


ఆత్మరక్షణ కోసం అనుసరించాల్సిన టెక్నిక్‌లను వివరిస్తున్న కోచ్

ఎలమంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే విద్యార్థినులు ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే శిక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని ఎలమంచిలి కరాటే కోచ్ నక్కా వెంకటరమణ సూచించారు. మంగళవారం పట్టణంలోని విజ్ఞాన భారతి స్కూలులో పోలీసుల సమక్షంలో విద్యార్థినులకు ఆత్మరక్షణలో భాగంగా కరాటేపై డెమో నిర్వహించారు. కరాటే సీనియర్ కోచ్ నక్కా వెంకటరమణస్కూలు విద్యార్థినులకు ఆత్మ రక్షణపై తర్ఫీదునిచ్చారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్‌కి ఘన స్వాగతం



సైక్లోథాన్ బృంద సభ్యులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఎలమంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరాల్లోని ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) ప్రారంభించిన సైక్లోథాన్-2025 మంగళవారం ఎలమంచిలి చేరుకుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు ఎలమంచిలి గురవప్ప కల్యాణ మండపం వద్దకు చేరుకున్న ఈ బృంద సభ్యులకు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, పట్టణ ప్రజలు, విశ్రాంత సైనిక ఉద్యోగులు, విశాఖ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు పూలవర్షం కురిపించారు. ఈ ర్యాలీ ఈనెల 31వ తేదీ కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ముగుస్తుందని వారు తెలిపారు.

నక్కపల్లిలో..

సురక్షిత తీరాలు-సమృద్ధి భారత్ అనే అంశంపై సైక్లింగ్ చేస్తున్న సీఐఎస్ఎఫ్ బృందం మంగళవారం సాయంత్రం మండలంలోని ఉద్దండపురానికి చేరుకుంది. వారిని సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పేకేటి రాజారావు, పొడగట్ల పాపారావు,అప్పారావు మాస్టారు, పరిమళ, అశ్విని అభినందించారు.

ఘనంగా అమ్మవార్ల పండగ

అచ్యుతాపురం రూరల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం, చీమలాపల్లిల్లో అమ్మవార్ల పండగలు మంగళవారం ఘనంగా జరిగాయి. చీమలాపల్లిలో నూతనంగా నిర్మించిన బోయిలమ్మవారి ఆలయంలో, హరిపాలెంలో పారిపిల్లమ్మవారి ఆలయంలో పండగలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ఆచరించారు. చీమలాపల్లిలో మూడేళ్లకొకసారి వచ్చే పండగను మంగళవారం బాణసంచా కాల్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సియాద్రి బుజ్జి, గ్రామ పెద్దలు సియాద్రి బైరాగి, మామిడి శివ అప్పారావు, నగిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిస్పోజబుల్ గ్లాసులను కాల్చి దోమల నుంచి రక్షణ


వేస్ట్ గ్లాసులను కాల్చి దోమల నుంచి రక్షణ పొందుతున్న మహిళలు

ఎలమంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదమని తెలిసి కూడా డిస్పోజబుల్ గ్లాసులను కాల్చి దోమల నుంచి రక్షణ పొందుతున్నారు మత్స్యకార మహిళలు. ప్రతి రోజూ తెల్లవారు 5 గంటలకే మత్స్యకార మహిళలు వచ్చి ప్రధాన రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తారు. తెల్లవారు జాము కావడంతో దోమల బారి నుంచి రక్షించుకునేందుకు రోడ్డు పక్కన తాగి పడేసిన గ్లాసులకు మత్స్యకార మహిళలు మంట పెట్టారు. ఆ పొగతో దోమలు సమీపంలో ఉండవని వీరి నమ్మకం.

మల్లవరంలో దాహం కేకలు

- పనిచేయని రెండు రక్షిత నీటి పథకాలు.. మోటారు
- నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా బంద్
- పట్టించుకోని అధికారులు.. అల్లాడుతున్న ప్రజలు

మాకవరపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రెండు రక్షిత నీటి పథకాలు ఉన్నప్పటికీ, ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. వారం రోజుల క్రితం ఒక పథకానికి నీరు అందించే మోటారు మరమ్మతులకు గురికావడంతో కుళాయిలు మూలకు చేరాయి. నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గుక్కెడు నీటి కోసం జనం అల్లాడిపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత్యంతరం లేకపోవడంతో గ్రామంలోని ఓ చర్చికి సంబంధించి తాగునీటి బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని వారు వాపోతున్నారు. దాని నుంచి నీటి జలాలు తగ్గిపోవడంతో అరకొరగానే తాగునీరు వస్తున్నదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మరి కొందరు మహిళలు పొలాల్లోని వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.

అలాగే మరో తాగునీటి పథకం ఉన్నప్పటికీ జలజీవన్ పథకంలో వేసిన పైపు లైన్ల వల్ల, తాగునీటి పథకానికి సంబంధించిన పైపులైన్లు పూర్తిగా పగిలి పోయాయి. దీంతో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రెండు పథకాలూ మరమ్మతులకు గురికావడంతో గుక్కెడు నీటి కోసం అల్లాడి పోతున్నామని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే తమ తాగునీటి కష్టాలు తీర్చాలని గ్రామస్థులు, మహిళలు వేడుకుంటున్నారు.


గ్రామంలోని తాగునీటి బోరు వద్ద బిందెడు నీటికి మహిళల పడిగాపులు



మల్లవరంలో పనిచేయని నీటి పథకం... మరమ్మతులకు గురైన మోటారు

వారం రోజులుగా నీరు రావడం లేదు

-చీపురపల్లి కన్నతల్లి, మల్లవరం



మల్లవరం గ్రామంలో వారం రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు రావడంలేదు. దీంతో బోరు నీరు తెచ్చుకుంటున్నాం. బోర్లు నుంచి కూడా అరకొరగా తాగునీరు వస్తున్నది. ఓ పక్క ఎండలు, మరోపక్క తాగునీరు అందక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా తాగునీటి సమస్యపై అధికారులు పట్టించుకోవాలి.


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు

- తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ

నాతవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ చెప్పారు. నాతవరం పాత సినిమా హాలు దగ్గర రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు టీడీపీ సీనియర్ నేత అంకంరెడ్డి యర్రాపాత్రుడుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం మెయిన్ రోడ్డు అధ్వానంగా ఉండేదని, దీన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తారు రోడ్డు వేసి బాగు చేశారని చెప్పారు. అలాగే రూ.30 లక్షలతో నాతవరం మెయిన్ రోడ్డు నుంచి పంచాయతన ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తవుతున్నాయ్యని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, టీడీపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇటంశెట్టి సీతారామ్మూర్తి, నాయకులు ఎ.మాణిక్యం, యి.ప్రభవతి యర్రా కాశీ, చింతకాయల శ్రీనువాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గొలుగొండ మార్చి, 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో మేరీరోజీ తెలిపారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షత ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. అన్ని శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కిరాణా దుకాణంలో చోరీ

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మార్కెట్లోని కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి అంజూరు శ్రీనివాసరావుకు చెందిన దుకాణం పై కప్పు సిమ్మెంటే రేకుకు కన్నం పెట్టి దుండగులు లోపలికి ప్రవేశించారు. కొంత నగదు, కిరాణా సామగ్రి అపహరించారు. మంగళవారం దుకాణం తెరిచిన శ్రీనివాసరావు చోరీ జరిగిన విషయం గ్రహించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ లచ్చన్న

గొలుగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ లచ్చన్న చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై డ్వాక్రా మహిళలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుచేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా సాగు చేసిన కూరగాయలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కరుణానిధి, మండల వ్యవసాయాధికారి సుధావాణి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు సరికాదు

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేశ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నూకాలమ్మ గుడి నిర్మాణానికి సీఎంఆర్ యాజమాన్యం ఇచ్చిన రూ.10 లక్షల విరాళం ఏమయ్యాయో మాజీ ఎమ్మెల్యేకే తెలియాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు తనపై బురద జల్లేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ అన్నారు. పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలోనే చాలా వరకు గుడి నిర్మాణం పూర్తి చేశామని, పెండింగ్ పనులకు సహకరించాలని సీఎంఆర్ యజమానిని అడిగితే రూ.10 లక్షలు విరాళం ప్రకటించారని తెలిపారు. ఆలయ చైర్మన్ దనిమిరెడ్డి నాగు ఈ నిధులు ఖర్చు పెట్టి సీఎంఆర్ మేనేజర్‌కి లెక్కలు చూపిస్తే, ఆ మేరకు డబ్బులు ఇచ్చేవారని తెలిపారు. తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఏకా శివ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉపాధి చూపాలని ధర్నా

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల వల్ల ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్లుకు ఉపాధి చూపించాలని మంగళవారం ధర్నా చేశారు. పెదబొడ్డేపల్లి ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఎస్.అప్పలకొండ, బొడ్డేటి వెంకట సూరి అప్పారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడంతో రీడర్లకు ఉపాధి పోతుందన్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లు పరిశ్రమలు, షాపులకు బిగిస్తున్నారని, త్వరలో కేటగిరి-1కి బిగిస్తే ఉపాధి కోల్పోతామని వాపోయారు. ప్రభుత్వం విద్యుత్ మీటర్ రీడర్లను దృష్టిలో ఉంచి వాచ్‌మన్‌లు, షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉపాధి చూపించాలని వారు విన్నవించారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

మాకవరపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ దుకాణాలకు వేలం నిర్వహించాలంటూ స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌డీవో ఉదయశ్రీ మంగళవారం విచారణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల పరిషత్‌కు చెందిన పది దుకాణాలకు వేలం నిర్వహించకుండా అధికారులు నడిపిస్తున్నారని పి.ఫ్రాన్సిస్ ఫిర్యాదు చేశారని, ఈ మేరకు ఆయన ఇంటికి స్వయంగా వెళ్లి విచారణ చేశామని చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

తారు రోడ్ల స్థితిగతులపై సర్వే: ఆర్అండ్‌బీ జేఈఈ

కృష్ణాదేవిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తారు రోడ్ల పరిస్థితిపై సమగ్ర సర్వే చేపడుతున్నట్టు నర్సీపట్నం ఆర్అండ్‌బీ జేఈఈ ప్రసాద్ తెలిపారు. దేవీపట్నం-నర్సీపట్నం తారు రోడ్డును మంగళవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారు రోడ్ల స్థితిగతులపై జీపీఎస్ వీడియో సర్వే చేస్తున్నామన్నారు. నర్సీపట్నం-తాళ్లపాలెం, నర్సీట్నం-తుని, దేవీపట్నం-నర్సీపట్నం రోడ్లపై సర్వే చేస్తున్నామన్నారు. రోడ్ల మరమ్మతులు, రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ఈ సర్వే అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో లీ అసోసియేషన్ సర్వే సంస్థ ప్రతినిధులు రమేశ్, రాజేశ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.92 లక్షలతో శ్మశాన వాటికల అభివృద్ధి

- పీఆర్ శాఖ డీఈ ఈశ్వరరావు

మాకవరపాలెం, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది శ్మశానవాటికల్లో అభివృద్ధి పనుల కోసం రూ.92 లక్షలు మంజూరయ్యాయని పంచాయతీ రాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు చెప్పారు. ఈ మేరకు మంగళవారం కామేశ్వరమ్మ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మాకవరపాలెం, రాచపల్లి, బూరుగుపాలెం, జి.గంగవరం తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలకు అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా రూ.12 లక్షలతోకామేశ్వర్‌నగర్ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ నాయకుడు అడిగర్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

21న లింగంపేట ఆలయ భూముల కౌలు లీజుకు వేలం పాట

- దేవదాయ శాఖ ఈవో దివ్యతేజ

కృష్ణాదేవిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని లింగంపేట నూకాలమ్మ ఆలయ భూముల కౌలు లీజుకు ఈ నెల 21వ తేదీన వేలం పాట నిర్వహిస్తామని దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి దివ్యతేజ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తమల్లంపేట సర్వే నంబర్ 36/1లో 23.53 సెంట్ల భూమి కౌలు లీజు కోసం ఆరేళ్ల కాల పరిమితికి వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు రూ.10 వేలు చెల్లించాలని, ఆధార్ కార్డుతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు దేవదాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి టిడ్కో గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల వద్ద డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులన్నీ పూర్తి చేసి తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సకాలంలో గృహాలు అప్పగించకపోవడంతో లబ్ధిదారులు బ్యాంకు రుణాల వడ్డీలు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు.

హైస్కూల్‌లో నాగుపాము కలకలం

చోడవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం నాగుపాము కలకలం సృష్టించింది. ఉదయం స్కూల్ ప్రారంభ సమయంలో విద్యార్థులంతా ప్రార్థన ముగించుకుని క్లాసులకు వెళుతుండగా స్కూల్ ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద నాగుపాము కనిపించింది. దీంతో విద్యార్థులు కేకలు వేశారు. భయంతో పరుగులు తీశారు. హైస్కూల్ వాచ్‌మన్ సురేశ్ ఆ పామును చంపేశాడు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎట్టకేలకు వమ్మలి చెరకు కాటాకు లారీ

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లారీలో చెరకు లోడింగ్ చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని వమ్మలి కాటా నుంచి చెరకు తోలకాలకు ఫ్యాక్టరీ యాజమాన్యం లారీని సమకూర్చింది. ఈ కాటాకు లారీని ఏర్పాటు చేయకపోవడంతో తోలకాలు కావడం లేదు. ఈ నేపథ్యంలో 'చెరకు రైతుల దిగాలు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి మంగళవారం వమ్మలి కాటాకు లారీని కేటాయించింది. ఒక్క రోజు 16 టన్నుల చెరకును లారీపై ఫ్యాక్టరీకి తరలించారు. దీంతో చెరకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ప్రజా చైతన్య యాత్రల ద్వారా సమస్యల గుర్తింపు'

కె.కోటపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా చైతన్య యాత్రలలో పలు సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి వినతులు అందిస్తున్నామని సీపీఎం జిల్లా నాయకుడు గండి నాయనబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని సింగందొరపాలెం, దాలివలస, కింతాడ, ఆర్లి, కె.సంతపాలెం, గొంపవానిపాలెం గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరక ప్రాంతాల్లో పండిస్తున్న జీడి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. జీడి పిక్కలకు కేజీకి రూ.200లకు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. ఉపాధి పథకం ద్వారా ఎకరం జీడి తోట అభివృద్ధికి రూ.90వేలు రైతులకు ఇవ్వాలని, జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వనము సూర్యనారాయణ, యర్రా దేవుడు, సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

శరభవరం-నర్సీపట్నం రోడ్డు పనులు ప్రారంభం


వడ్డిపలో చేస్తున్న రోడ్డు పనులు

రోలుగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శరబవరం-నర్సీపట్నం రోడ్డు మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గత ఐదేళ్లుగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శరభవరం నుంచి వడ్డిప, బుచ్చెంపేట మీదుగా నర్సీపట్నానికి నిత్యం 10 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత ప్రభుత్వం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసిన క్వారీల నుంచి అధిక బరువుతో లారీలు వెళ్లడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి.

నేడు అడ్డూరులో సత్రం భూములకు కౌలు వేలం

చోడవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డూరులో గల రాజా చింతలపాటి బుచ్చిసీతయ్యమ్మ సత్రానికి చెందిన భూములకు బుధవారం ఆ గ్రామంలోని నూకాలమ్మ గుడి వద్ద కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ. సత్యనారాయణ తెలిపారు. మూడేళ్లకు నిర్వహిస్తున్న ఈ వేలంలో రైతులు పాల్గొనాలని కోరారు.

పోతనపూడి అగ్రహారంలో కొళాయిలకు మోటార్లు

- 21 అనధికారిక మోటార్లను గుర్తించిన అధికారులు
- తొలగించాలని ఆదేశించిన ఎంపీడీవో


కొళాయిల పైపులైన్‌కు ఏర్పాటు చేసిన మోటార్లను తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతనపూడి అగ్రహారంలో పంచాయతీ కొళాయిలకు బిగించిన మోటార్లను తొలగిస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శితో కలిసి వెళ్లి గ్రామంలోని కొళాయిలకు బిగించిన మోటార్లను పరిశీలించారు. రక్షిత నీటి పథకం ద్వారా తాగు నీరు సరఫరా చేసే పైపులైను నుంచి 23 ఇళ్లకు మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్నట్లు గుర్తించారు. తక్షణమే వాటిని తొలగించాలని అధికారులు సంబంధిత వ్యక్తులను ఆదేశించారు. ఎగువ ప్రాంతంలో ఉన్నందున తమ ఇళ్లకు తాగునీరు సక్రమంగా అందడం లేదని, అందుకే మోటార్లు బిగించి డమ్ములో నీటిని నింపుకుంటున్నామని ఆ వ్యక్తులు అధికారులకు వివరించారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ పైపులైన్‌కు మోటార్లు బిగించకూడదని, ఎగువ ప్రాంతానికి నీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మోటార్లు తొలగించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండగ


అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

మాడుగుల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మోదమాంబ కాలనీతోపాటు పలు వీధులకు చెందిన భక్తులు అమ్మవారి ఘటాల పండగ నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చైర్మన్ పుష్పాల అప్పలరాజు చేయించారు.

వీరవిల్లి అగ్రహారంలో..

మాడుగుల రూరల్: మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో మోదకొండమ్మ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికిఇ పసుపు, కుంకుమ, ఘటాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వెల్ కమ్ సునీతా విలియమ్స్



సునీతా విలియమ్స్‌కు స్వాగతం పలుకుతున్న ఆడమ్స్ చిన్నారులు

చోడవరం, మార్చి18(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో 8నెలలపాటు చిక్కుకుని సురక్షితంగా భూమికి తిరిగివస్తున్న సునీతా విలియమ్స్‌కు ఆహ్వానం పలుకుతూ స్థానిక ఏడమ్స్ స్కూల్ విద్యార్థినులు స్వాగతం పలికారు. సునీతా విలియమ్స్ బుధవారం తెల్లవారుజామున భూమికి తిరిగి వస్తున్న సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బద్రిమహంతి ఫాల్గుణ్ స్కూల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు సునీతా విలియమ్స్‌ను బ్రేవ్‌లేడీగా కీర్తిస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా తయారు కావాలి

- డిప్యూటీ కమిషనర్లు శ్రీరామచంద్రమూర్తి, సుధీర్


సారాపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

దేవరాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామంగా మారితే గ్రామస్థులు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని అనకాపల్లి, విశాఖపట్నం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీరామచంద్రమూర్తి, డి.సుధీర్ అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో సారా తయారీ, తాగడం వలన వచ్చే అనర్థాలపై అవగాహన కలిగించారు. మత్తు పదార్థాలు సేవించడం, చెడు వ్యసనాలకు బానిసై యువత పక్కదారి పట్టి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.పాపునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను అన్ని రంగాల్లోనూ తీర్చిదిద్దాలి : ఎంఈవో

రావికమతం, మార్చి18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అన్ని రంగాల్లోనూ తీర్చిదిద్దాలని మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ తలుపులు అన్నారు. పరవాడ ఎన్టీపీసీ అందజేసిన రూ.82 వేలు విలువైన బోధనోపకరణ సామగ్రిని రావికమతం భవిత కేంద్ర దివ్యాంగ విద్యార్థులకు ఎంఈవో మంగళవారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ సామగ్రి అందజేసిన ఎన్టీపీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు, మేడివాడ హైస్కూల్ హెచ్ఎం వంకాయల రామారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల జామియా మసీదు అధ్యక్షుడిగా మస్తాన్


నియామక పత్రాన్ని అందుకుంటున్న మస్తాన్

మాడుగుల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాడుగుల జామియా మసీదు కమిటీ అధ్యక్షుడిగా మస్తాన్‌ను నియమించారు. రాష్ట్ర బోర్డు జారీ చేసిన నియమాకమ ఉత్తర్వులను మస్తాన్‌కు విశాఖ జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి అహ్మద్ అందజేశారు. జామియా మసీదు అభివృద్ధి, ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని మస్తాన్ తెలిపారు.

ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్

చోడవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదర్శపంచాయతీ రాయపురాజుపేటలో మంగళవారం ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగించి, పరిసరాలు పరిశుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీని నూరుశాతం నో ప్లాస్టిక్ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ రామునాయుడు తెలిపారు.

31లోగా కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

చోడవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌కార్డుదారులు కుటుంబసభ్యులతో సహా ఈనెల 31లోగా ఈ కేవైసీ చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ అంబటి రామారావు మంగళవారం తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని పక్షంలో వారికి ఏప్రిల్ నెల రేషన్ సరకులు పంపిణీ చేయరన్నారు. అందువల్ల కార్డుదారులంతా తమ రేషన్‌దుకాణాల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. .

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి : ఎంపీపీ


బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న గాడి కాసు, ఈశ్వరరావు

చోడవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించామని ఎంపీపీ గాడి కాసు తెలిపారు. మండలంలోని కన్నంపాలెంలో మంగళవారం బోర్లు తవ్వే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బోర్లు తవ్వుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, సర్పంచ్ బర్ల తాతయ్యలు, బైన బుజ్జి, సాలాపు సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

'విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చు'

రావికమతం, మార్చి18 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో చీడపీడలను అధిగమించేందుకు విత్తన శుద్ధి దోహదపడుతుందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజకుమార్ అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన మత్స్యవానిపాలెంలో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పండించిన పంటలోనే సొంతంగా నాణ్యమైన విత్తనం తయారు చేసుకునేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టివోటి డా. కిశోర్ పర్యవేక్షణలో నిర్వహించారు. విద్యార్థినులు పి. బిందుమాధవి, ఎ.మేఘన, ఎస్.రచన, పి.చరిష్మా, కె.మణిదీపిక, సీహెచ్ అంకిత తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతోనే ప్రాణ రక్షణ



వాహనలు రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనింగ్ ఎస్ఐ రవికుమార్

హుకుంపేట మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రికార్డులతో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రైనింగ్ ఎస్ఐ వై. రవికుమార్ తెలిపారు. మంగళవారంస్థానిక పాడేరు, అరుకు, బాకూరు మూడు రోడ్లు మధ్యలో ఉన్న రాళ్లగడ్డ వద్ద వాహనలు తనీఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. లేకుంటే జరిమానం విధిస్తామన్నారు. హెల్మెట్ వల్ల ప్రాణాలకు రక్షణగా ఉంటుందన్నారు.

రోడ్డు పనులకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలి



గ్రామాల్లో పర్యటిస్తున్న జడ్పీటీసీ గంగరాజు, నేతలు

అనంతగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు జారీచేయకుంటే అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని పినకోట పంచాయతీ తట్టబూడి, చిందులపాడు గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమిధ నుంచి చింతపాక, తట్టబూడి, చిందులపాడు మీదుగా పెదబూరగ గ్రామానికి రూ.16.56 కోట్లతో రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేసినా, ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ, ఇంజనీరింగ్‌శాఖ సమన్వయలోపంతో గిరిజనులకు డోలీమోతలు తప్పడం లేదన్నారు. ఇకనైనాఅటవీశాఖ అనుమతులు జారీచేసి రోడ్డు పనులను ప్రారంభించాలని కోరారు. కార్య క్రమంలో నాయకులు గంగులు, రాజు, సురేశ్, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

జి.మాడుగుల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన డేవిడ్‌రాజుకు స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్.రామకృష్ణ, కె.కృష్ణమూర్తి, కె.రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండిపుట్టులో అంగన్‌వాడీ కార్యకర్తను నియమించాలి

పాడేరురూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డోకులూరు పంచాయతీ మండిపుట్టులోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తను నియమించాలని గ్రామస్థుడు, గిరిజన సంఘం మండల కార్యదర్శి సోమెలి చిట్టిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఈ కేంద్రంలో 20 మంది చిన్నారులు, 8 మంది బాలింతలు, ఇద్దరు గర్భిణులు ఉన్నారన్నారు. 40 రోజులుగా కార్యకర్త లేక పోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెసా కార్యదర్శి ఎస్.కామేశ్వరరావు, గ్రామస్థులు హరి, సూరిబాబు, నాగరాజు, చిన్నతల్లి, అప్పలకొండ పాల్గొన్నారు. ఈ విషయంపై సీడీపీవో ఝాన్సీరాణి వద్ద ప్రస్తావించగా మండిపుట్టులో కార్యకర్త పనితీరుపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టితొలగించామన్నారు. ప్రస్తుతం ఆ కేంద్ర నిర్వాహణ బాధ్యతలను డోకులూరు కార్యకర్తకు అప్పగించామన్నారు.

గాంధలో తాగునీటి సౌకర్యం కల్పించాలి

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ గాంధలో గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన గిరిజనులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో 350 మంది జనాభా ఉన్నారని, వీరంతా తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు గురి అవుతున్నారని చెప్పారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. సీపీఎం నాయకులు, గ్రామ గిరిజనులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

అనంతగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం తోపాటు ఆరోగ్యం చేకూరుతుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిట్టం మురళి అన్నారు. మండలంలోని దండబాడులో గిరిజన యువకులకు మంగళవారం వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈసందర్భంగా మురళీ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూ రంగా ఉండాలన్నారు.

'వెంకటరాజు సేవలు మరువలేం'

జి.మాడుగుల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేత, తన భర్త దివంగత మత్స్యరాస వెంకటరాజు సేవలు మరువలేనివని మాజీ మంత్రి మణికుమారి అన్నారు. మంగళవారం ఆయన 21వ వర్ధంతిని పురస్కరించుకొని వెంకటరాజు విగ్రహానికి ఆమెతో పాటు పలువురు కూటమి నేతలు వెంకటరాజు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ ప్రాంత అభివృద్ధికి వెంకటరాజు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేశ్ నాయుడు, నాయకులు సోమెలి చిట్టిబాబు, ఎస్.నాగబ్బాయి, సురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఆస్పత్రికి బల్లుగుడ చిన్నారులు

» జ్వరంతో బాధపడుతున్న 14 మంది తరలింపు

» పరిస్థితిని సమీక్షించిన తహశీల్దార్



ముంచంగిపుట్టునుంచి అంబులెన్స్‌లో చిన్నారులకు తరలిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆస్పత్రిలో గత కొద్దిరోజులుగా వైద్య సేవలు పొందుతున్న మండలంలోని బాబుసాల పంచాయతీ బల్లుగూడకు చెందిన 14 మంది చిన్నారులను మెరుగైన చికిత్స కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో మంగళవారం సాయంత్రం తరలించారు. ఆ గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు ఇటీవల జ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ అనారోగ్యంతో బాధపడుతున్న ఆ గ్రామానికి చెందిన 21 మంది చిన్నారులను రెండు విడతలుగా స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చి గత కొద్ది రోజులుగా చికిత్స అందిస్తున్నారు. అయితే వారిలో కొంత మంది చిన్నారుల పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు తరలించారు. కె.మన్మధ్, కె.కావ్యశ్రీ, కె.మీరరంజన, పి.రియారోషి, వి.ప్రసాద్, వి.మల్లేశ్, వి.హరి, కె.మరియా, కె. మీనా, వి.పల్లవి, కె.మీనాక్షి, వి.రాజేశ్, వి.రామదాసు, వి.శశి తదితరులకు జ్వరం, దగ్గు, జలుబు తగ్గకపోవడంతో జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు సీహెచ్‌సీ వైద్యులు గీతాంజలి, సంతోశ్ తెలిపారు. అలాగే, సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న బల్లుగూడ చిన్నారులను తహసీల్దార్ నర్సమ్మ, సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్, వైసీపీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. నాటు వైద్యం జోలికి వెళ్లరాదని, ఎటువంటి ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించాలని బాధిత చిన్నారుల తల్లిదండ్రులకు వారు సూచించారు.



సీహెచ్‌సీలో పిల్లలతో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ

శాస్త్రీయ రీతిలో తేనెటీగల పెంపకంతో లాభాలు

» రస్తకుంటుబాయ్ కేవీకే అధిపతి డాక్టర్ దుర్గా



రైతులకు సూచనలు ఇస్తున్న కేవీకే అధిపతి డాక్టర్ దుర్గా

చింతపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు తేనె పెట్టెల నిర్వాహణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని మన్యం జిల్లా రస్తకుంటుబాయ్ కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. దుర్గా అన్నారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరుగుతున్న తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే అధిపతి, కీటక విభాగం శాస్త్రవేత్త మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రైతులు అత్యధికంగా ఎపిస్ సెరేని ఇండికా తేనెటీగలను పెట్టెల్లో పెంచుతున్నారన్నారు. వీటిలో తేనె దిగుబడి తక్కువగా వస్తుందన్నారు. రైతులు ఎపిస్ మెల్లిపెరా తేనెటీగలను పెంపకం వల్ల ఒక పెట్టె నుంచి గరిష్ఠంగా 20కిలోల దిగుబడి వస్తుందన్నారు. ప్రధానంగా తేనె పెట్టెల అమరికలోనూ ప్రత్యేక మెలకువలు పాటించాలన్నారు. వర్షాకాలం, ఎండాకాలం తేనెటీగల సంరక్షణకు అధిక ప్రా ధాన్యం ఇవ్వాలన్నారు. తేనె పెట్టెలను తక్కువ బరువుగల చెక్కలతో చేయించుకోవాలన్నారు. తేనె పెట్టెల మధ్య పది మీటర్ల దూరం, మూడు మీటర్ల ఎడం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సీలేరు, మార్చి 18, (ఆంధ్రజ్యో తి): జీకేవీధి మండలం సీలేరు జడ్పీ హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్ష కేం ద్రంలో మంగళవారం 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ కె. నాగేశ్వరరావు తెలిపారు. ఈ కేంద్రంలో 153 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, వారికి కేటాయించిన ఈ ఏడు రూమ్‌ల్లో కూడా ఏడు సీసీ కెమెరాలతోపాటు బయట ఆవరణలో మరొకటి ఏర్పా టుచేశారన్నారు.

ధ్రువపత్రాల జారీలో నిర్లక్ష్యంపై ఫిర్యాదు

జి.మాడుగుల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్‌ఎంఏసీ, కుల, ఆదాయ ధ్రుపపత్రాల జారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పెసా కమిటీ మండల ఫోరం అధ్యక్షుడు ఎల్.రాకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన మా ట్లాడుతూ, సొలభం పంచాయతీ వయ్యరిగరువు గ్రామం, పీవీటీజీ కులానికి చెందిన కొర్ర కమేశ్వరరావు ఎఫ్‌ఎంసీ ధ్రువపత్రానికి దరఖాస్తు చేసి 21 రోజులు గడిచిన సదరు వ్యక్తికి మంజూరు కాలేదన్నారు. దీనిపై రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌ను అడగగా, ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆయన ఆరోపించారు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

» కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణను విధిగా చేపట్టి జిల్లాలోని 281 చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధిపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చెత్తసంపద కేంద్రాలను సంపూర్ణంగా వినియోగంలోకి తేవాలని, వారంలో కనీసం రెండు సార్లు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేలా చూడాలన్నారు. తాగునీటి ట్యాం కులను క్లోరినేషన్ చేయాలన్నారు. అలాగే జిల్లాకు ఇటీవల మంజూరైన 34 పంచాయతీ భవనాలకు రెవెన్యూ అధికారులు స్థలాలు కేటాయించే ప్రక్రియ చేపట్టాలన్నారు. అలాగే రైతులు రిజిస్ట్రేషన్ ప్రకియను వేగవంతం చేయాలన్నారు. పీఎం కిసాన్ పథకంలోని మొత్తం ఒక లక్షా 66 వేల మంది రైతులుంటే ఇప్పటికి కేవలం 53 వేల మంది రైతులను మాత్రమే రిజిస్టర్ చేశారని, మిలిగిన వారిని నమోదు చేయాలన్నారు. అలాగే అన్ని పంటల సాగు చేస్తున్న రైతులను ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. అలాగే బిందు సేద్యం విస్తీర్ణం పెంచాలని, నిరుద్యోగులకు వృత్తి శిక్షణ అందించాలనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో బి.లవరాజు, జిల్లా గ్రామసచివాలయాల నోడల్ అధికారి పీఎస్.కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, మైక్రో ఇ రిగేషన్ పీడీ రహీమ్, డ్వామా పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్‌గా గౌరీశంకరరావు



వీసీ జారీ చేసిన ఉత్తర్వులను అందుకుంటున్న గౌరీశంకరరావు

పాడేరురూరల్, మార్చి 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్-2 ప్రోగ్రాం ఆఫీసర్ జి.గౌరీశంకరరావును ఎన్ఎస్ఎస్‌జిల్లా నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఏయూ వైస్ చాన్సలర్ నియామక ఉత్త ర్వులు జారీ చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టబ్బాయి తెలిపారు. ఈ సందర్భంగా గౌరీశంకరరావును ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్.ఎస్.హరినాథ్, ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ వి.రమేశ్ బాబు, జానకీరామ్, సీహెచ్.అచ్యుత్, అరకు, చింతపల్లి ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు అభినందించారు.

సంప్రదాయ ఆహార పంటలతో ఆరోగ్యం

డుంబ్రిగుడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలతో ఆరోగ్యకరం సాధ్యమని ఎంపీడీవో ప్రేమ్ సాగర్ అన్నారు. మండలంలోని లక్కు గ్రామంలో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీ సంప్రదాయ ఆహర పంటల పండుగను నిర్వహించారు. చిరు, తృణధాన్యాలతో తయారు చేసిన ఆహర పదార్థాలు, పప్పు దినుసులు,అటవీ ఫలసాయాలు, దుంపలు, ఆకుకూరలు, ఔషధవనమూలికల ప్రదర్శన చేపట్టారు. సం ప్రదాయంగా పండించే దినుసులో పోషకాలుంటాయని సీపీఎఫ్ సంస్థ పీఓనాగమణి అ న్నారు. అనంతరంథింసా నృత్యాలతో సంబంధించినసంగీత వాయిద్యాలు అందజేశారు. కార్యక్రమంలో చింతూరు, భద్రచలంకు చెందిన సంస్థ ప్రతినిధులు రాము, గానినాయుడు, సీసీలు లక్ష్మి, మాలతి, గిరిజనులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి

» ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ అభిషేక్ గౌడ



మల్టీపర్పస్ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న అభిషేక్ గౌడ

పాడేరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో రూ. 1. 20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రెండు మల్టీపర్పస్ కేంద్రాలను ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి, జేసీ డాక్టర్. ఎంజే. అభిషేక్ గౌడ మంగళవారం పరిశీలించారు. మండలంలోని ముంతమామిడి, రణంబడి గ్రామాల్లో పర్యటించిన ఆయన ఈ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణంబడి మల్టీపర్పస్ సెంటర్‌ను రెండు నెలల్లో పూర్తి చేయాలని, ముంతమామిడి సెంటర్‌ను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో భవనానికి రూ. 60 లక్షలవ్యయం చేస్తున్నామని, నాణ్యతలో ఎ క్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. మల్టీపర్పస్ కేంద్రాల్లో హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీఈ రవికుమార్, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డోలీమోతపై వివరణ కోరిన డీఎంహెచ్‌వో

అనంతగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ రాచకీలం గ్రామానికి చెందిన గర్భిణిని డోలీపై తరలింపుపై డీఎంహెచ్‌వో జమాల్ బాషా స్పందించారు. ఆ గ్రామానికి చెందిన సుకూరు దేముడమ్మను డోలీపై తరలింపుపై ఈనెల 14న తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై డీఎంహెచ్‌వో పినకోట పీహెచ్‌సీ వైద్యాధికారులను వివరణ కోరారు. దేముడమ్మ తమ పీహెచ్‌సీలో 8వ తేదీన వైద్యసేవలను పొందారని, అనంతరం ప్రసవానికి 25 రోజులకు పైగా సమయం ఉండడంతో ఆమెను కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువెళ్లినట్టు డీఎంహెచ్‌వోకు తెలిపారు. ఈనెల 13న ఆమెకు నొప్పులు వస్తుండడంతో అంబులెన్స్ పంపించామని, రహదారి సౌకర్యం లేక గ్రామానికి కిలో మీటర దూరం డోలీమోతపై ఆమెను తీసుకువచ్చారన్నారు. అనంతరం అంబులెన్స్‌లో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉంటున్నట్టుగా వైద్యాధికారులు వివరణ ఇచ్చారు..

రాయితీపై వ్యవసాయ పరికరాలు

కొయ్యూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఆధునిక సాగును ప్రో త్సహించేలా వివిధ యంత్రాలను వాటర్‌షెడ్ పథకంలో 90 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోందని ప్రాజెక్టు అధికారి శంకరరావు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా మండలంలో కొయ్యూరు, మంప, రావణాపల్లి, రేవళ్లమర్రివాడ పంచాయతీలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ ఐదు పం చాయతీలలో రైతులకు 5 హెచ్‌పీ వాటర్ ఇంజన్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు, నీటిపైపులు, వివిధ రకాల ఇనుప నాగళ్లు, విత్తనాలు ఎదజల్లే యంత్రాలు, రోటావేటర్లు (తుప్పలు తొలగింపునకు) తదితర పరికరాలు రాయితీపై అం దించనున్నట్టుగా వివరించారు. వివరాలకు మండల కేంద్రంలో తమ కార్యాలయంలో రైతులు సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సమస్యపై ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు, సీపీఎం నేతలు

చింతపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాయినగర్‌వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన మహిళలు ఆందోళన చేశారు. మంగళవారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో ర్యాలీగా వెళ్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఎం నేతలు, మహిళలు మాట్లాడుతూ మూడేళ్లగా ఏటా వేసవిలో కాలనీలో నీటి సమస్యను తీవ్ర స్థాయిలో ఎదుర్కొంటున్నామన్నారు. మహిళలు ఆందోళన చేస్తే హామీలివ్వడం తప్పా శాశ్వత పరిష్కారం చూపడంలేదన్నారు. కాలనీకి నీటి సరఫరా చేసేంత వరకు మండల పరిషత్ కార్యాలయాన్ని విడిచిపెట్టి వెళ్లేదిలేదని బైఠాయించారు. దీంతో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు వచ్చి నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాలతతో బుడతలవేనం నుంచి గ్రావిటీ పథకం ద్వారా చింతపల్లి ప్రజలకు నీటి సరఫరాకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. నెల రోజుల్లో నీరు అందుబాటులోకి తెస్తామన్నారు. అప్పటి వరకుట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామన్నారు. దీంతో శాంతించిన మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి. స్వర్ణలత, పంచాయతీ గు మస్తా అంబేడ్కర్, గిరిజన సంఘం నేతలు సాగిన చిరంజీవి, మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు : సీఐ



సూకురు పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సీఐ నాయుడు

హుకుంపేట మార్చి 18 (ఆంధ్రజ్యోతి) ; విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని సూకురు ఆశ్రమ పాఠశాలలోని సంకల్ప కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిసారించారు. తమ గ్రామాల్లో గంజాయి సాగుతో కలిగే అనర్థాలపై అవగాహన చేయాలని విద్యార్థులకు సూచించారు.గంజాయికి బదులు కాఫీ, మిరియాల సాగు చేయాలని కోరాలని ఆయన కోరారు. బాగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల నిరసన



ఆందోళన చేస్తున్న మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులు

చింతపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు భారీగా పెరిగిపోవడం వల్ల భోజన పథకం నిర్వాహణ భారంగా మారిందన్నారు. నిర్వాహకులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. నవంబరు, డిసెంబరు, జనవరిలో ఒక్కో నెలకు రూ.మూడు వేలు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.వెయ్యి మాత్రమే చెల్లించారన్నారు. ఇద్దరు పనిచేస్తున్న పాఠశాలలో ఒకరి మాత్రమే వేతనం మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయుడు సాగిన చిరంజీవి, నిర్వాహకుల సంఘం నాయకులు పసుపులేటి లక్ష్మి, కేసుబాబు, జ్యోతి, వెంకటరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు సహకరించాలి



కలెక్టర్ దినేష్ కుమార్‌ను సాలువతో సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌ను ఆలయ, ఉత్సవ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు కోరారు. మేలో జరగనున్న ఈ ఉ త్సవాలు నేపథ్యంలో మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కలెక్టర్‌తో మాట్లాడుతూ ఈ ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏటా మాదిరిగా ఈసారి రూ. కోటి కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు కె.సురేశ్‌కుమార్, కె.ప్రశాంత్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

సీలేరు, మార్చి 18, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో ఆంజనేయ స్వామి వారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచి మండప ఆవాహనాలు, 108 ఘటాలు, సు గంధ ద్రవ్యాలతో స్వామి వారికి పంచామృతాభిషేకం, నాగవల్లి సహిత వడిమాల పూజ తదితర కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం చండీ హోమం నిర్వహించారు.. సోమవారం రాత్రి గ్రామంలో రథోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వాల్తేరు డివిజన్‌లోనే అరకును కొనసాగించాలి

» లోక్‌సభలో ఎంపీ గుమ్మ తనూజారాణి



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి

అనంతగిరి, అరకులోయ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో రైల్వే బడ్జెట్‌పై జరిగిన చర్చలో అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి మంగళవారం మాట్లాడారు. అరకురైల్వేస్టేషన్‌ను వాల్తేరు డివిజన్‌లో కొనసాగించాలని ఆమె కోరారు. రాయగడ డివిజన్‌కు బదిలీ చేయొద్దని, దీనివలన గిరిజనులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆమె ఈసమావేశంలో కోరారు. విశాఖ రైల్వేజోన్‌కు శాశ్వతంగా మేనేజర్‌ను నియమించాలని తెలిపారు. అమరావతికి 363 కిలో మీటర్ల దూరం ఉన్నందున హై-స్పీడ్ రైలును అవసమని, ఆ దిశగా చర్యలు చేపట్టాని కోరారు.

నీటి తొట్టెలో పడిన చిన్నారికి అస్వస్థత

» భద్రాచలం ఆస్పత్రిలో కోలుకుంటున్న పాప



పాపకు సీలేరులో చికిత్స చేస్తున్న వైద్యాధికారి

సీలేరు, మార్చి 18 , (ఆంధ్రజ్యోతి): ఏడాది చిన్నారి ఇంటి వెలువల తొట్టెలో పడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్సనందించడంతో ప్రస్తుతం కోలుకుంటోంది. ప్రస్తుతం ఆమె భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలివి... జీకేవీధి మండలం సీలేరు పీహెచ్‌సీ పరిధిలోని దుప్పులవాడ పంచాయతీ వలసపల్లి గ్రామానికి చెందిన పార్వతి, బలరామ్ దంపతుల ఏడాది పాప పూర్ణిమ మంగళవారం ఉదయం ఇంటి బయట ఆడుతూ నీటి తొట్టెలో ప్రమాదవశాత్తు పడిపోయింది. తల కిందకు కాళ్లుపైన ఉండిపోవడంతో పాప పైకి లేవలేక నీటిని తాగేసింది. ఇంటి పనుల్లో ఉన్న తల్లి పార్వతి పాప పడిపోయిన కొద్ది నిమిషాల తర్వాత గమనించి బయటకు తీసింది. వెంటనే బైకుపై సీలేరు పీహెచ్‌సీకి తీసుకురావడంతో వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌వల్లీ ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్య సేవలకోసం జెన్‌కో సీఎస్ఆర్ అంబులెన్సులో చింతూరు తరలించారు. అక్కడ వైద్య సేవలను అందించినా, పాప ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనలపై భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం. పాపను సకాలంలో ఏరియా ఆసుపత్రులకు తీసుకువెళ్లడానికి జెన్‌కో యాజమాన్యం, సిబ్బంది సహకరించడంతో చిన్నారి ప్రాణాలతో బయటపడింది.



మాట్లాడుతున్న బేడ, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు ధూపం సత్యం

బేడ, బుడగ జంగం కులస్థులను ఎస్సీ వర్గీకరణలో చేర్చడం హర్షణీయం

- బేడ, బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యం

పరవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగం కులస్థులను ఎస్సీ వర్గీకరణలో చేర్చడం హర్షణీయమని బేడ, బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధూపం సత్యం పేర్కొన్నారు. పరవాడ రామాలయం వద్ద మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదికను సోమవారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆమోదించడం సంతోషకరమన్నారు. దీనివల్ల బేడ, బుడగ జంగం కులస్థుల కష్టాలు తీరినట్టేనని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సాధ్యమైనంత తొందరలో చట్టబద్ధత కల్పించి వర్గీకరణ ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కొరుపోలు గంగాధర్, సభ్యులు పరవాడ లోవరాజు, పూడి ఈశ్వరరావు, గరికపాటి సత్యనారాయణ, రాజేశ్వరరావు, మల్లేశ్ పాల్గొన్నారు.

ఘనంగా డొంకమాంబిక ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్

కొత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరంపూడి గ్రామంలో డొంకమాంబిక అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు రత్నాకర్‌ను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

పోటాపోటీగా వారపు సంత వేలం పాట



ఆశీల పాటలో పాల్గొన్న పాటదారులు

కశింకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోటలో వారపు సంత, రోజువారీ ఆశీల పాట మంగళవారం పోటాపోటీగా జరిగాయి. రోజువారీ మార్కెట్‌లో ఆశీల వసూలు నిమిత్తం 27 మంది పాటదారులు పాల్గొన్నారు. వీరిలో డోకుల వెంకటసత్యారావు రూ.2.18 లక్షలకు పాడుకున్నారు. అలాగే వారపు సంత నిమిత్తం 28 మంది పాటదారులు పాల్గొన్నారు. వీరిలో డోకుల వెంకటసత్యారావు రూ.1,22,500కు పాడుకున్నారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రరావు, ఈవోపీఆర్‌డి వెంకటలక్ష్మి, సచివాలయ కార్యదర్శి పద్మ, సర్పంచ్ మంత్రి జయరజని, కూటమి నేతలు వేగి గోపీ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ పండుగ



పూజలు అందుకున్న అమ్మవారు

పరవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం ప్రజల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచులు కూండ్రపు వరలక్ష్మి, శివలంక లక్ష్మి, మాజీ సర్పంచ్ కూండ్రపు సన్యాసినాయుడు, స్థానిక నాయకులు కూండ్రపు మధు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, వియ్యపు చిన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం అనుపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

పైడిమాంబ మారువారం పండుగ

పరవాడ పైడిమాంబ మారువారం పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అలాగే భరణికం గ్రామంలో పరదేశిమాంబ పండుగ నిర్వహించారు. సర్పంచ్ పెదిశెట్టి పూజ, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, నాయకులు దాట్ల గణేష్‌రాజు, పెదిశెట్టి సత్యారావు, బొండా సన్నిదేముడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించి అనుపోత్సవం నిర్వహించారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు



దీక్షలో కర్చొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పీటీడీ ఎండీ జారీ చేసిన 1/2019 సర్క్యులర్ ప్రకారం సీ అండ్ టీ కేసుల్లో పాయింట్ల విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎస్ఎంయూపీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో కేఆర్.లక్ష్మి, ఎస్.పద్మ, పి.సత్యవతి, సీహెచ్‌వీ.లక్ష్మి కూర్చున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా..!

- సెజ్ తాగునీటి పైపులైన్‌కు రంధ్రం
- ఏడాదిగా తాగునీరు వృథా
- రహదారులపై ఏరులై పారుతున్న నీరు
- పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు



రహదారిపై వృథాగా పారుతున్న నీరు

పరవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)కు తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌కు రంధ్రం ఏర్పడి ఏడాది



పైపులైన్‌కు రంధ్రం ఏర్పడడంతో వృథాగా పోతున్న నీరు

కావస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే గత ఏడాది నుంచి మండల పరిషత్ జంక్షన్ సమీపంలో భూమి అడుగుభాగాన పైపులైన్‌కు రంధ్రం దీంతో తాగునీరు వృథాగా పోతోంది. ప్రధాన రహదారి మీదుగా నీరు పారుతూ సమీపంలోని గెడ్డలోకి చేరుతోంది. ఈ క్రమంలో ఏడాదిగా ఇక్కడ నీరు వృథా కావడం ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలుస్తోంది. అధికారుల తీరు పట్ల స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఏడాదిగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకుండా నిద్రమత్తులో ఉన్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఈ సంఘటన చోటుచేసుకున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు మేల్కొని తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

జంతువుల పట్ల దయాగుణంతో మెలగండి

- ఉన్నత పాఠశాలల్లో జీవకారుణ్య క్లబ్‌లు
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జంతువుల పట్ల దయాగుణంతో మెలగాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా జీవకారుణ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల పట్ల దయాగుణం కలిగేలా చిన్నతనం నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం ప్రతీ ఉన్నత పాఠశాలలోనూ జీవకారుణ్య క్లబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణా జరగకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీ, మండల కేంద్రాలలో వీధి కుక్కలకు పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని, వాక్సినేషన్ చేయాలని, అందుకు ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలని జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులకు తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో కనీసం వంద వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయాలన్నారు. తద్వారా కుక్క కాట్ల సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి బి.రామ మోహనరావు, డీపీవో ఆర్.శిరీషారాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాజశేఖర్, పి.శ్రీదేవి, ఎల్.సత్యనారాయణ, కె.బెన్నినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకం నిరోధించడమే సీఐఎస్ఎఫ్ లక్ష్యం



కశింకోట నుంచి ర్యాలీగా వెళ్తున్న జవాన్లు

కశింకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని పెంపొందించి డ్రగ్స్ వాడకాన్ని నిరోధించడమే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) లక్ష్యమని సీనియర్ కమాండర్ సతీష్‌కుమార్ వాజ్పేయి, డిప్యూటీ కమాండర్ ఎస్.కె.సాహు తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సముద్ర పరివాహక ప్రాంతాల మీదుగా 80 మంది జవాన్లతో చేపట్టిన సైకిల్ ర్యాలీ మంగళవారం స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా కూటమి నేతలు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వేగి గోపీకృష్ణ, దాసరి బాబు, ఆర్ఈసీఎస్ పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఉమాశంకర్, అసోసియేట్ ప్రిన్సిపాల్ కె.శివ తదితరులు వీరికి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాల్లో సంఘ విద్రోహ శక్తుల నుంచి దేశానికి ప్రమాదం కలగకుండా తీసుకుంటున్న భద్రతా నియమాలను విద్యార్థులకు వివరించారు. ఈ ర్యాలీ భారతదేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో సముద్ర తీర ప్రాంతాల మీదుగా 6553 కిలోమీటర్ల మేర కొనసాగుతున్నదని చెప్పారు. ఈ సైకిల్ ర్యాలీకి దారి పొడవునా ప్రజాదరణ ఎంతగానో లభిస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు తిరుపతిరావు ఆధ్వర్యంలో జవాన్లకు అవసరమైన మందులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండర్ అమిత్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కుమార్, ఏఎస్ఐ పీవీకే రావు, హెచ్‌సి.కరణం రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులు ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలి

కశింకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్ల రేషన్ కార్డుదారులందరూ ఈ నెల 31వ తేదీలోగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్ విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి 60 సంవత్సరాలు పైబడిన రేషన్ కార్డుదారులందరూ చౌకధరల దుకాణం డీలరు వద్దకు వెళ్లి ఆధార్ ఈకేవైసీని నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసుకోవాలన్నారు. లేకుంటే ఏప్రిల్ 1 నుంచి నిత్యావసర సరుకులు నిలిపివేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని పెండింగ్‌లో ఉన్న కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేషన్ డిపోల్లో ఈకేవైసీ పెండింగ్ జాబితాలు

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఈకెవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ పెండింగ్ జాబితా ఆయా డీలర్ల వద్ద ఉందని, రేషన్ డిపోకు వెళ్లి విధిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకేవైసీ చేయించుకోని వారికి ఏప్రిల్ నెల నుంచి రేషన్ నిలిపివేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

భద్రతా ప్రమాణాలు పాటించడం తప్పనిసరి

జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి



విజేతల బహుమతులు అందిస్తున్న శివశంకర్‌రెడ్డి

పరవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎన్.శివశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలను ఫార్మాసిటీలోని ఎస్ఎస్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విధులను నిర్వర్తించాలన్నారు. యాజమాన్యాలు కూడా భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ చైర్మన్ కుమరేషన్ రాజేంద్రన్, మేనేజర్ పాండవ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా తయారుకావాలి

- డిప్యూటీ కమిషనర్లు శ్రీరామచంద్రమూర్తి, సుధీర్

దేవరాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామంగా మారితే గ్రామస్థులు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని అనకాపల్లి, విశాఖపట్నం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీరామచంద్రమూర్తి, డి.సుధీర్ అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో సారా తయారీ, తాగడం వలన వచ్చే అనర్థాలపై అవగాహన కలిగించారు. మత్తు పదార్థాలు సేవించడం, చెడు వ్యసనాలకు బానిసై యువత పక్కదారి పట్టి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.పాపునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల ఆందోళన



ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు

అనకాపల్లి టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ మీటర్ రీడర్లు మంగళవారం ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మీటర్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి కష్టపడిన మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను అందుబాటులోకి రావడం వల్ల ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని విన్నవించారు. 2019 నుంచి ఇప్పటి వరకు మీటర్ రీడర్లకు ఒక్క పైసా వేతనం పెంచకపోవడం దారుణమన్నారు. యూనియన్ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పి.తులసీరావు, బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు డిస్కామ్స్ సీఎండీలు ఎస్క్రో అకౌంట్ వేతనాలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా కిందస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉద్యోగ భద్రత కల్పించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, శ్యామలరావు, కె.లోవరాజు, వరహా సంతోష్, సత్యనారాయణ, వీవీ రమణ, అప్పలనాయుడు, శివ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఈపీఎఫ్ పెన్షనర్లు

అనకాపల్లి టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పింఛన్ రూ.5 వేలకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ పెన్షన్‌దారులందరికీ ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని విన్నవించారు. అలాగే 2014 నుంచి 2024 మధ్య కాలంలో ద్రవ్యోల్బణం కూడా చాలా పెరిగినందున, నెలవారీ కనీస పింఛన్ పెంచకపోవడం బాధాకరమని వాపోయారు. ఈ ధర్నాలో బీఎంఎస్ నాయకులు లాలం ప్రసాద్, గోకివాడ శ్రీరాములు, బొట్టా రమణ, కె.సతీశ్ పాల్గొన్నారు.

ఇందిరా మార్కెట్ కిరాణా దుకాణంలో చోరీ

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మార్కెట్లోని కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి ఎ.శ్రీనివాసరావుకు చెందిన దుకాణం పై కప్పు సిమ్మెంటు రేకుకు కన్నం పెట్టి దుండగులు లోపలికి ప్రవేశించారు. కొంత నగదు, కిరాణా సామగ్రి అపహరించారు. మంగళవారం దుకాణం తెరిచిన శ్రీనివాసరావు చోరీ జరిగిన విషయం గ్రహించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జోరుగా సర్వేల ప్రక్రియ

పి4 సర్వేలో సబ్బవరం మూడో స్థానం

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పి4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్, మిస్సింగ్ సిటిజన్స్ సర్వే జోరుగా సాగుతున్నదని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలో 21,487 కుటుంబాలు ఉండగా, అందులో బీపీఎల్ కుటుంబాలు 18004 ఉన్నాయన్నారు. 15,562 కుటుంబాల సర్వే పూర్తి చేశామన్నారు. దీంతో జిల్లాలోనే సబ్బవరం మూడో స్థానంలో నిలిచినట్టు చెప్పారు. అలాగే వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేకు సంబంధించి మండలంలో 34,472 మంది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 20,430 మందికి సర్వే పూర్తిచేసి జిల్లాలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే లక్ష్యం 4158 కాగా ఇప్పటికి 3710 మంది సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. పీ4 సర్వే గడువు పూర్తి కాగా, మిగతా రెండు సర్వేలకు ఈ నెలాఖరు వరకూ ఉందని ఎంపీడీవో తెలిపారు.

కాండం తొలిచే పురుగుతో అప్రమత్తంగా ఉండండి

- వ్యవసాయాధికారి స్వప్న

కశింకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం తొలిచే పురుగు పట్ల రైతులంతా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం.స్వప్న సూచించారు. మండలంలోని తేగాడ, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, నువ్వుల పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి కండంతొలిచే పురుగు ఆశించే అవకాశం ఉన్నందున కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి, 8కెజి ఎకరాకు 20 కిలోల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలన్నారు. అంతేకాకుండా భూ ఆధార్ కార్డుకు రైతులందరూ నమోదు చేసుకోవాలని రైతులకు ఆమె సూచించారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎ.నూకశ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

క్వారీ లారీలను కట్టడి చేయండి

ఆమ్‌ఆద్మీ కన్వీనర్ హరినాథబాబు

అనకాపల్లి టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న క్వారీ లారీలను కట్టడి చేయాలని ఆమ్‌ఆద్మీ అనకాపల్లి కన్వీనర్ కె.హరినాథబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా భారీ బండరాళ్లతో వెళ్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి భారీ ఎత్తున లోడ్ వేసి వాహనాలు ప్రయాణిస్తున్నాయని ఆరోపించారు. ఈ ప్రయాణాల్లో పలు సందర్భాల్లో మెయిన్ రోడ్డులో బండరాళ్లు నేలకొరిగాయని, ఆ సమయంలో అటుగా ఎవరైనా వెళ్లినప్పుడు ఆ బండరాళ్లు పడితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సోమవారం తెల్లవారు జామున కూడా భారీ బండరాళ్లతో వెళ్తున్న టిప్పర్ గడ్డర్‌ను ఢీకొట్టడం వల్ల రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారన్నారు. కేవలం జరిమానా విధించి వదిలి వేయకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు అన్నదానం

అనకాపల్లి టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం నాగేంద్ర స్వామి ఆలయం వద్ద ప్రతీ వారం మాదిరిగానే ఈ మంగళవారం కూడా పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. విల్లూరి మహాలక్ష్మినాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మహాలక్ష్మినాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పరవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పరవాడ పైడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన పైలా ప్రసాద్ రూ.2 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ చెక్కును మంగళవారం సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు సమక్షంలో అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆలయ అభివృద్ధికి సాయం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామునాయుడు, ఉప సర్పంచ్ బి.రామారావు, పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

మాకవరపాలెం: మండల పరిషత్ దుకాణాలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌డీవో ఉదయశ్రీ మంగళవారం విచారణ చేపట్టారు. మండల పరిషత్‌కు చెందిన పది దుకాణాలకు వేలం నిర్వహించకుండా అధికారులు నడిపిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు విచారణ చేసినట్టు ఆమె చెప్పారు.

బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు... మానసిక ఒత్తిడి

సమస్య బారినపడి కోలుకుంటున్న వారిని వేధిస్తున్న అనేక ఇబ్బందులు

చిన్నచూపు చూస్తున్న సమాజం, కుటుంబం

ఏయూ సైకాలజీ విద్యార్థి పరిశోధన







- ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 110 మంది బాధితుల నుంచి అభిప్రాయాల సేకరణ
- కోలుకునేందుకు కుటుంబ సభ్యుల నుంచి మద్దతు, కౌన్సెలింగ్ అత్యంత కీలకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గడిచిన కొన్నాళ్లుగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే ఈ సమస్య కనిపించేది. ఇప్పుడు వయసుతో నిమిత్తం ఉండడం లేదు. బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన వారిలో కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం, మూతి వంకర పోవడం వంటి ఇబ్బందులు ఉంటాయి. స్ట్రోక్ బారినపడిన వారిలో ఎక్కువ మంది సాధారణ స్థితికి రావడానికి చాలాకాలం పడుతుంది. స్ట్రోక్ తరువాత దాదాపు 80 శాతం మంది వైకల్యంతో బాధపడుతుంటారు. ఇలా స్ట్రోక్ బారినపడి పక్షవాతానికి గురైన బాధితులపై ఏయూ సైకాలజీ విభాగానికి చెందిన విద్యార్థి పరిశోధన చేశారు. 'పక్షవాత బాధితుల్లో మానసిక ఒత్తిడి-జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో తగ్గుతున్నాయి' అనే అంశంపై నార్త్ కోస్టల్ ఏపీకి చెందిన బాధితులపై భరత్‌కుమార్ పరిశోధన సాగించారు. ఏయూ సైకాలజీ విభాగాధిపతి ఎంవీఆర్ రాజు ఆధ్వర్యంలో సాగిన ఈ పరిశోధన తాజాగా ముగిసింది.

తీవ్రమైన మానసిక ఒత్తిడి

బ్రెయిన్ స్ట్రోక్ బారినపడి కోలుకుంటున్న బాధితులు తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతున్నట్టు పరిశోధనలో తేలింది. స్ట్రోక్ తరువాత జీవన ప్రమాణాలు గణనీయంగా తగ్గాయి. ఆర్థిక ఇబ్బందులు, ఫ్యామిలీలో కొన్నిరకాల సమస్యలు ఉత్పన్నం కావడం, జీవితం అయిపోయిందనే భావనలోకి వెళ్లడం, ఆత్మస్థైర్యాన్ని చాలామంది కోల్పోవడం, కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం, పనిచేయలేని స్థితికి చేరడం, సంపాదించే పరిస్థితి లేకపోవడం, ఉద్యోగంలోనూ ప్రాధాన్యం తగ్గించడం (ఉద్యోగులు బాధితులైతే), స్థానాలను మార్చడం..వంటి అనేక ఇబ్బందులను బాధితులు ఎదుర్కొంటున్నట్టు పరిశోధక విద్యార్థి తేల్చారు. వీటి వల్ల బాధితులు తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. స్ట్రోక్ బారినపడిన తరువాత ఎక్కువ మందిలో పిల్లల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. కుటుంబం, సమాజం కూడా చిన్నచూపు చూడడం, గతంలో మాదిరిగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం కూడా మానసికంగా కుంగుబాటుకు గురిచేస్తున్నాయి. దీనివల్ల బాధితుల్లో నాణ్యమైన జీవన ప్రమాణం తగ్గుతోంది.

భరోసా అత్యంత కీలకం

స్ట్రోక్ బాధితుల జీవన ప్రమాణాలను పెంచేందుకు, ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలు బారినపడకుండా ఉండేందుకు కుటుంబ సభ్యుల నుంచి భరోసా ఉండాలి. అదే సమయంలో శారీరకంగా కోలుకునేందుకు ఫిజియో థెరపీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒత్తిడి, ఇతర మానసిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు అవసరమైన సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం. ఫ్యామిలీ, వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇవ్వాలి. అలాగే, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్, మెడిటేషన్, యోగా, రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

మూడు జిల్లాల్లో నమూనాలు

ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 110 మంది బాధితులను ఈ పరిశోధనలో భాగంగా కలిసి అనేక వివరాలను సేకరించారు. వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారు 110 మంది ఉండగా, శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు 17 మంది, విజయనగరం జిల్లాకు చెందినవారు 15 మంది ఉన్నారు. వీరంతా దాదాపు ఇవే ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు పరిశోధక విద్యార్థి గుర్తించారు.

ఒత్తిడితో గణనీయంగా తగ్గిపోతున్న జీవన ప్రమాణం

- పీవీఎస్ఆర్ భరత్‌కుమార్, పరిశోధక విద్యార్థి



సాధారణంగా స్ట్రోక్ వచ్చిన తరువాత శారీరక ఇబ్బందులతోపాటు మానసికంగానూ అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుండడంతో జీవన ప్రమాణం గణనీయంగా తగ్గుతోంది. ఈ కుంగుబాటు నుంచి బయటపడేందుకు కుటుంబ సభ్యుల నుంచి భరోసా కావాలి. అది దక్కకపోవడం వల్లే ఇబ్బంది ఎదురవుతోంది. సాధారణ స్థితికి చేరుకోవడానికి ఫిజియో థెరపీ,కౌన్సిలింగ్ వంటివి అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. పరిశోధనలో భాగంగా గుర్తించిన అంశాలను బట్టి వారికి కొన్ని రికమండ్ చేశాం. ఇందులో కౌన్సెలింగ్, కాగ్నెటివ్ బిహేవియర్ థెరపీ వంటివి ఉన్నాయి. 2020 నుంచి 2024 మధ్య ఈ పరిశోధన సాగింది.

కుటుంబ సభ్యుల భరోసా అత్యంత కీలకం

- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి, గైడ్



స్ట్రోక్ బాధితుల పట్ల సమాజం, కుటుంబ సభ్యులు వ్యవహరించే తీరు వారిని మరింత వేదనకు గురి చేస్తుంటుంది. స్ట్రోక్ వచ్చిన వారిని సమాజం కూడా చిన్నచూపు చూస్తుంది. కుటుంబ సభ్యులు గతంలో ఇచ్చిన గౌరవాన్ని ఇవ్వరు. ఇవన్నీ వారిని తీవ్రమైన మానసిక కుంగుబాటుకు గురిచేస్తుంటాయి. స్ట్రోక్ వల్ల అప్పటికే తగ్గిన జీవన ప్రమాణం... ఈ తరహా మాటలు, చర్యల వల్ల మరింత తగ్గుతుంటుంది. జీవన ప్రమాణాన్ని పెంచాలంటే కుటుంబ సభ్యులు భరోసా అత్యంత కీలకం. అదే సమయంలో కౌన్సెలింగ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- ప్రయాణికులు మరిచిపోయిన బంగారు నగల బ్యాగును తిరిగి అప్పగించిన వైనం..
- అభినందించిన సీఐ



సీఐ సమక్షంలో బంగారు ఆభరణాలను అప్పగిస్తున్న ఆటో డ్రైవర్

నక్కపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ ఒకరు నిజాయితీని చాటుకున్నారు.ఆటోలో ప్రయాణికులు మరిచిపోయిన బంగారు వస్తువులను పోలీసుల ద్వారా వారికి అప్పగించి మన్ననలు పొందారు. వివరాల్లోకి వెళితే.. నక్కపల్లి టీచర్స్ కాలనీలో నివాసం వుంటున్న చెందిన బిక్కవోలు వెంకట కృష్ణ, శిరీష దంపతులు రెండు రోజుల కిందట విజయవాడ వెళ్లారు. సోమవారం సాయంత్రం బస్సులో నక్కపల్లికి తిరిగి వచ్చారు. లగేజీ కూడా వుండడంతో బస్టాండ్ వద్ద ఆటో మాట్లాడుకుని ఇంటికి చేరుకున్నారు. సామాను తీసుకునే క్రమంలో బ్యాగు ఒకటి ఆటోలో మరిచిపోయారు. ఈ విషయాన్ని డ్రైవర్ కూడా గమనించలేదు. కొంతసేపటి తరువాత బంగారు ఆభరణాలు వున్న బ్యాగు కనిపించలేదు. సోమవారం రాత్రి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎనిమిది తులాల బంగారు నగలు వున్న బ్యాగును ఆటోలో మరిచిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తునికి చెందిన ఆటో డ్రైవర్ గెడ్డమూరి అంజి మంగళవారం సాయంత్రం శిరీష ఇంటికి వచ్చి, ఆటోలో మరిచిపోయిన బ్యాగును వారికి చూపించారు. అప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె చెప్పింది. దీంతో పోలీసుల సమక్షంలోనే బ్యాగును అందజేస్తానని ఆటో డ్రైవర్ చెప్పడంతో అంతా కలిసి స్టేషన్‌కు వెళ్లారు. సీఐ కుమారస్వామి సమక్షంలో శిరీషకు బ్యాగు అందించారు. ఆటో డ్రైవర్ అంజిని సీఐ అభినందించారు.

ఆటోలో నుంచి జారి పడి వలస కూలీ మృతి

హనుమాన్‌జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్ పీఎస్ పరిధిలో ఆరుగొలను వద్ద నడుస్తున్న ఆటోలో నుంచి ఓ వ్యక్తి జారిపడి మృతిచెందాడు. ఎస్ఐ లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కార్మికులు కొద్ది రోజుల కిందట గుడివాడ సమీపంలోని డోకిపర్రు గ్రామంలో అపరాలతీత పనులకు వచ్చారు. పనులు ముగియడంతో సొంతూరు వెళ్లేందుకు గుడివాడ నుంచి మంగళవారం తెల్లవారుజామున ఆటోలో హనుమాన్ జంక్షన్ వెళుతున్నారు. ఆరుగొలను సమీపంలోకి వచ్చేసరికి బావవరపు మల్లీశ్వరరావు (48) ప్రమాద వశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

నేర పరిశోధనపై అవగాహన ఉండాలి

- విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు
- న్యాయ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐ జాతీయ పోటీలు ప్రారంభం



క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ 6వ జాతీయ పోటీలను ప్రారంభిస్తున్న విశాఖ పోలీసు కమిషనరేట్ న్యాయసలహాదారు రామకృష్ణారావు. పక్కన వైస్‌చాన్సలర్ సూర్యప్రకాశరావు.

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేరాలకు సంబంధించి 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్'పై పోలీసులతోపాటు న్యాయ విద్యార్థులు కూడా అవగాహన కలిగి ఉండాలని విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోని ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ (సీఎస్ఐ) 6వ జాతీయ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ, నేరం జరిగిన ప్రదేశం, అక్కడ ఆధారాలు సేకరించడం కేసు విచారణకు ఎంతో కీలకమని చెప్పారు. చిన్నపాటి ఆధారాన్ని కూడా వదలకూడదని స్పష్టం చేశారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక అభివృద్ధి కారణంగా కొత్త తరహాలో నేరాలు జరుగుతున్నాయని, ఇందుకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై న్యాయ విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ మాట్లాడుతూ, ఒక కేసులో న్యాయం జరగాలంటే ఆ కేసులో వాస్తవాలు, సాక్ష్యాలను సేకరించడం ఎంతో కీలకం అన్నారు. సరైన సాక్ష్యం సేకరించకపోతే బాధితులకు అన్యాయం జరుగుతుందన్నారు. న్యాయవాద వృత్తిలోకి వచ్చే ముందు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, సీఎస్ఐ ద్వారా న్యాయ విద్యార్థులు నేర పరిశోధనలో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఆచరణాత్మక అనుభవాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని సీపీ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, డాక్టర్ రిపత్‌ఖాన్, రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరకు పంటకు నిప్పంటించిన రైతు

... 5వ పేజీ తరువాయి

జరుగుతుందో లేదో నమ్మకం లేక..పండించిన చెరకు తోటను తగలబెట్టుకోవాల్సి వచ్చిందని వెంకటరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెండు వారాల్లో చెరకు క్రషింగ్ పూర్తికి చర్యలు: జేసీ

దేవరాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీకి చెరకును సత్వరం తరలించడానికి తగిన చర్యలు చేపట్టాలని గోవాడ షుగర్స్ ఎండీ సన్యాసినాయుడును జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఆమె కొత్తపెంటలో రైతు నిప్పుపెట్టిన చెరకు తోటను పరిశీలించారు. రైతు వెంకటరావుతో మాట్లాడారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని, ఒకవేళ పంటను కూలీలతో నరికించి ఫ్యాక్టరీకి తరలించినా అదనపు ఖర్చు తప్ప ...ప్రయోజనం లేదని నిప్పు పెట్టినట్టు చెప్పారు. చాలామంది రైతులు ఇదే పరిస్థితిలో ఉన్నారని, న్యాయం చేయాలని కోరారు. రైతు ఆవేదనను విన్న ఆమె పక్కనే ఉన్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడుతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ పరిధిలో గల 2,600 ఎకరాల్లోని చెరకు క్రషింగ్ రెండు వారాల్లో పూర్తిచేయడం జరుగుతుందన్నారు. చెరకు బకాయిలు కూడా చెల్లిస్తామన్నారు. రైతులకు ఎటువంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎండీని ఆమె ఆదేశించారు. జేసీ వెంట మండల వ్యవసాయ అధికారి కాంతమ్మ, సర్పంచ్ రొంగలి వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కాలిన చెరకు తోటను పరిశీలించి, రైతు వెంకటరావుతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

364 కిలోల గంజాయి పట్టివేత

... 5వ పేజీ తరువాయి

గంజాయి కొనుగోలు చేసి, అరకులోయ, ఎస్.కోట, పెందుర్తి, సబ్బవరం మీదుగా మహారాష్ట్రలోని పుణెకు తరలిస్తున్నట్టు చెప్పారు. వీరితోపాటు మరో వాహనంలో వస్తున్న ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. గంజాయిని తూకం వేసి 363.8 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. నిందితుల నుంచి నాలుగు ఆండ్రాయిడ్ ఫోన్లు, ఒక కీప్యాడ్, రూ.50 వేల నగదు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అల్లూరి జిల్లా జీకే వీధికి చెందిన సామిరెడ్డి విజయ్, చింతపల్లి మండలం లోతుగెడ్డకు చెందిన వంతల హరీశ్‌బాబు, మాడాబత్తుల అరుణకుమార్, కొర్రా మహేశ్‌బాబు, ఎస్.నారాయణ, సరమండ అనిల్‌కుమార్, మహారాష్ట్రకు చెందిన జి.సాగర్ శివాజీలను అరెస్టు చేసి అనకాపల్లి కోర్టుకు తరలించారు.

ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై సీఐడీ దూకుడు

... 5వ పేజీ తరువాయి



కుంచంగిలో ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు (ఫైల్ ఫొటో)

సంబంధించి పలు రికార్డులను వెంట తీసుకెళ్లారు. ల్యాండ్‌పూలింగ్ జరిగిన కాలంలో ఈ పనిచేసిన రెవెన్యూ అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులకు తాజాగా సీఐడీ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం వీరు ఏ మండలంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై సీఐడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవాల్సి ఉంటుందని రెవెన్యూ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మరోవైపు రైతుల నుంచి సమీకరించిన భూముల వివరాలు, సర్వే నంబర్లు, పరిహారంగా కేటాయించిన ప్లాట్లకు సంబంధించిన వివరాలను సీఐడీ సేకరిస్తున్నట్టు సమాచారం. కుంచంగి, కూండ్రంగి, సంపతిపురం, కోడూరు, వేటజంగాలపాలెం కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను సీఐడీ ఆదేశించింది.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో గిరిజనుడి మృతి



చెట్టుపై మంగలన్న మృతదేహం

అరకులోయ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మేకలకు మేత కోసం చెట్టు కొమ్మలను నరుకుతున్న ఓ గిరిజనుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధి కొత్తకిల్లోగుడ గ్రామానికి చెందిన కొర్ర మంగలన్న(55) మంగళవారం మధ్యాహ్నం మేకలను మేత కోసం గ్రామ సమీపంలోకి తీసుకువెళ్లాడు. చెట్టు ఎక్కి కొమ్మలను కత్తితో నరుకుతుండగా విద్యుత్ తీగలకు కత్తి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

పరారీలో ఉన్న గంజాయి కేసు నిందితుడి అరెస్టు

చోడవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఆరేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ బి.అప్పలరాజు తెలిపారు. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు గ్రామానికి చెందిన గడుతుల పరశురాం 2019లో గంజాయి కేసులో నిందితుడు. అప్పటి నుంచి పరశురాం పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న అతను మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉండగా, పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీలపై ఓవర్ లోడు కేసులు, రూ.6.59 లక్షల జరిమానా

ఎలమంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి అధిక లోడుతో బండరాళ్లను రవాణా చేస్తున్న తొమ్మిది లారీలను పట్టుకుని రవాణా శాఖ అధికారులకు అప్పగించినట్టు పట్టణ ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. సోమ, మంగళవారాల్లో పాత జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టామని, ఈ సందర్భంగా రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీ పనులకు బండరాళ్లను రవాణా చేస్తున్న టిప్పర్ లారీలను ఆపి, వే బ్రిడ్జిపై తూకం వేయించామన్నారు. పరిమితికి మించి రవాణా చేస్తున్న తొమ్మిది వాహనాలను సీజ్‌చేసి, తదుపరి చర్యల నిమిత్తం రవాణా శాఖ అధికారికి రిఫర్ చేసినట్టు చెప్పారు. ఆర్టీవో పరిశీలించి రూ.6.59 లక్షల జరిమానా విధించారని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మోసాద సతీశ్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ రామారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని చెట్టుపల్లికి చెందిన మోసాద సతీశ్(32) అదే గ్రామానికి చెందిన మోసాద గోవింద్‌తో కలిసి సోమవారం ద్విచక్ర వాహనంపై నర్సీపట్నం వెళ్లి వస్తున్నాడు. రామలక్ష్మీపురం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి సతీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక వున్న గోవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా మంగళవారం మృతి చెందాడు. సతీశ్ భార్య గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బయ్యవరంలో కలకలం

- వంతెన కింద మూటలో మహిళ శరీర భాగాలు
- నడుము నుంచి కింద భాగం, కుడిచెయ్యి మాత్రమే లభ్యం
- పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఎస్పీ వకుల్ జిందాల్
- ఎక్కడో హత్యచేసి.. శరీర భాగాలను ఇక్కడ వేసినట్టు వెల్లడి



మహిళ శరీర భాగాలు వున్న మూటను పరిశీలిస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం సమీపంలో అండర్ బ్రిడ్జి వద్ద మూటకట్టి వున్న గుర్తు తెలియని మహిళ శరీర భాగాలు లభ్యం కావడం కలకలం రేపింది. మంగళవారం వంతెన కింద నుంచి పొలం పనులకు వెళుతున్న రైతులు చూసి పోలీసులకు, వీఆర్‌వోకు, వీఆర్ఏకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తరువాత క్లూస్ టీంను రప్పించి మూటను విప్పారు. గుర్తు పట్టలేని విధంగా మహిళ శరీరభాగాలు బయట పడ్డాయి. మహిళ నడుము నుంచి కింద భాగం, కుడిచెయ్యి మాత్రమే వున్నాయి. గుర్తుపట్టడానికి కీలకమైన తలతోపాటు మొండెం, ఎడమ చెయ్యి లేవు. స్థానిక పోలీసుల నుంచి సమాచారం అందుకున్న జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వకుల్ జిందాల్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మహిళను ఎక్కడో దారుణంగా హత్య చేసి, ముక్కలుగా నరికి మూటకట్టి ఇక్కడకు తీసుకువచ్చి పడేసి వుంటారని భావించారు. హత్యకు గురైన మహిళ వయసు సుమారు 40 సంవత్సరాలు వుంటుందని అంచనా వేశారు. కుడి తొడపై 1.5 అంగుళాల నల్లమచ్చ, కాలు వేళ్లకు రెండు వెండి తొడుగులు, కుడి చేతి మణికట్టుపై టాటూ, నాలుగు రోల్డ్‌గోల్డ్ గాజులు ఉన్నాయని ఇన్‌చార్జి ఎస్పీ చెప్పారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 9440796088 (సీఐ స్వామినాయుడు) లేదా డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా వుంచుతామన్నారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మృతదేహం శరీర భాగాలను ప్యాకింగ్ చేసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇన్‌చార్జి ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు ఎం. దేవప్రసాద్, ఎల్.మోహనరావు, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐలు స్వామినాయుడు, విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, కోటేశ్వరరావు, పైడపునాయుడు, అప్పలరాజు, ఎస్ఐలు మనోజ్ కుమార్, లక్ష్మణరావు ఉన్నారు.

రసాయన పరిశ్రమల్లో రక్షణ చర్యలు తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల్లో రసాయన లీకేజీలను గుర్తించేందుకు సెన్సార్‌లను వినియోగించాలన్నారు. పరిశ్రమల్లో అమర్చేరక్షణ పరికరాలకు జాతీయ సేఫ్టీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో 12 రసాయన పరిశ్రమల్లో రక్షణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయాషా, ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ఎస్ నారాయణ, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	418
శ్రీకాకుళం	419